


# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జూలై 2018

సంపుటి : 24 **282** సంచిక : 7




## జంబూ ద్వీపం ఒక వైపున ఉంటే, క్రౌంచ ద్వీపం మరొక వైపున ఉన్నది!
## -చిరకాలం నుంచి వీటి మధ్య రాకపోకలున్నాయ్!-

ఎలా ఉన్నాయ్? ఎందుకున్నాయ్? ఎవరు రాకపోకలు సాగించారు? అనే మూడు ప్రశ్నలకూ త్రికాలజ్ఞులైన భారత మహర్షులు సోదాహరణంగా సమాధానములిచ్చారు!!

### ప్రపంచంలోని ప్రముఖాంధ్రుల ప్రశంసలను పవిత్రమైన ఆశీర్వాక్షతలుగా భావిస్తున్నది!

**కెనడాలోని ప్రముఖాంధ్రాభిమాని సూరపునేని లక్ష్మీనారాయణగారు ఫోనుచేసి ఆశీర్వదించడం నాకెంతో మహానందం కల్గించింది!**

నేను అమెరికా వస్తున్నాననిగానీ, వచ్చాననిగానీ ఎవరికీ చెప్పలేదు; ప్రముఖాంధ్రలోనూ ప్రకటించలేదు. కెనడాలోని టొరంటోలో ఉంటున్న సూరపునేని లక్ష్మీనారాయణగారికి యెలా తెలిసిందో తెలియదు. మే 3 వ తేదీన ఆయన అమెరికాలోనున్న నాకు ఫోను చేసి శుభాకాంక్షలు చెప్పడం నన్నానందకాసారంలో ముంచెత్తి వేసింది. కెనడా అమెరికాలను చీల్చుకుని సప్తస్వరజనితంగా వీనులకు విందు కూర్చే నయగారా జలపాతంలా– ఆ మధురమూర్తి వాగ్వాణి త్యాగరాజకృతిగా సర్వాంగములనూ ఆనంద తన్మయత్వంలో మునిగి మునకలు వేయించింది. శరీరంలోని నీరస నిస్సత్తువులను పటాపంచలం చేసింది. ఎందరెందరో మహానుభావులను పరిచయం చేసిన ప్రముఖాంధ్రకు ముందుగా కృతజ్ఞతలను చెబుతూ, కెనడాలోని ప్రముఖాంధ్ర పాఠకాగ్ర శ్రేణియైన సూరపునేని లక్ష్మీనారాయణగారికి కృతజ్ఞతలూ, ప్రత్యాభినందనములను తెలియచేస్తున్నాను.

పెదవుల్ని చీల్చుకుని వచ్చిన మధురాధర మధురవాక్కులతో మరొక పర్యాయము కృతజ్ఞతలను తెలియచేస్తున్నాను.

బుధజన విధేయుడు


– గోటేటి శ్రీరామారావు

ఆర్యచరిత్ర ఐదువేల సంవత్సరములుగా ఉన్నదని చెబుతుంటారు. లక్షలాది సంవత్సరాలని కొందరు అంటారు. ఎవరూ ఎలా వ్యాఖ్యీకరణం చేసినప్పటికినీ లక్ష సంవత్సరాల చరిత్ర, సంస్కృతి ఆర్యచరిత్రను ప్రభవింపచేస్తూన్నది. ప్రభావం కనిపిస్తూనే ఉన్నది. ఈ సాగరాలూ, ఖండాలూ లేకుండా భరతదేశం ఏకఖండంగా, భరతవర్షంగా వర్ధిల్లినదీ, ఒక పార్శ్వాన జంబూద్వీపం, మరో పార్శ్వాన క్రౌంచ ద్వీపమూ ఉన్నాయనీ, వీటి మధ్య చరిత్రకారులు పర్యటిస్తూండేవారనీ అంటూంటే– మరి కొందరు భువి అంతా ఏకఖండ భూఖండమనీ సగరపుత్రులు కనిపించని యాగాశ్వం కోసం భువిని త్రవ్వుకుంటూ పోయారనీ, వారి కారణంగానే సాగరాలు (మహాసముద్రాలు) ఏర్పడ్డాయనీ అంటారు.

ఈ అనంతమైన భూశ్రేణుల మధ్యనున్న జలశ్రేణులే సాగరాలనీ ఐతిహాసికులు అంటున్నారు. ఇతిహాసకులు చెప్పేది అసత్యమెలా అవుతుంది.

ఇతిహాసము అంటే జరిగినది చెప్పడమే కదా!

కొలంబస్ దేశాల్ని కనిపెట్టాడనీ, వాస్కోడిగామా దేశాల సంచారం చేసాడని చెబుతారు. అంతక్రితమే భారతీయులు సంచారం చేసారు, అంతరిక్షయానం చేసారు. పుష్పకవిమాన సంచారం చేసారు. సాగరంలో వారధులు కట్టారు. శ్రీరాముడు లంకాయానం వారధిగుండానే చేసాడు. ఈ విషయాన్ని కట్టు కథ అన్నారు మనదేశ నాస్తికులు. నాసావారు చెప్పే వరకూ నమ్మలేదు– అంటే బయటవాడు చెబితేనే మనం నమ్ముతాం.



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# కలియుగం పునీతం కావడానికి భక్తి!

## భక్తి సంగీతం ప్రధాన కారణం అన్నారు! రాగరాజైన త్యాగరాజు

భక్తి కీర్తనలతో లోకాన్ని పావనం చేసినవారు, సంగీత పరబ్రహ్మస్వరూపులు శ్రీ త్యాగరాజస్వాములవారు!

వారిని కీర్తిశేషులనడం కన్నా, వారే ఈనాడు సంకీర్తనల రూపంలో జీవిస్తున్నారు– అని చెప్పడం సబబు అనుకుంటాను.

వేలకొలది సంకీర్తనములు చేసి, వేలాది భక్తి కీర్తనలను వ్రాసిన శ్రీరామభక్తాగ్రేసరుడాయన.

ఏ భాషలోని సంగీత విద్వాంసులైననప్పటికినీ వారి సంగీతసభలో త్యాగరాజు కీర్తనను పాడకుండా సంగీత సభను ముగించరు; మంగళగీతమును పాడరు.

ఆయన నోటి వెంట అనేకవేల శ్రీరామభక్తి గీతాలాపన జరిగినప్పటికినీ, కౌసల్యాసుప్రజారామా అన్నట్లు తిరుమల శ్రీవారిని దర్శించి, తెరతీయగ రాదా, నాలో మత్సరమను తెరతీయగ రాదా– అనెడు సంకీర్తమును ఎందరెరుగుదురు.

ఆయన శ్రీవారిని దర్శించడానికి వెళ్ళినపుడు, స్వామివారికి హారతినిచ్చి తెరను మూసి ఉంచారు. త్యాగరాజువారు నిరుత్సాహపడలేదు. "తెరతీయగరాదా! నాలోమత్సరమను తెరతీయగరాదా" అంటూ సంకీర్తనం చేసారు. వెంటనే శ్రీవారి తెరతొలగింది. దర్శనమిస్తూ త్యాగరాజులవారిని ఆనందింపచేసారు.

త్యాగరాజుపై శ్రీవారికెంతో అనురాగం కలిగింది. శ్రీనివాసుడెంతటి భక్తవత్సలుడుగాకున్నచో దర్శనమిచ్చేవారా? ఆ మధ్య శ్రీవారి ఆలయంలో జరిగిన మహత్తర మహత్యాన్ని పత్రికలు వెల్లడించాయ్.

దర్శనం వరుసలో నున్న ఓ మూగపిల్లవాడు. 'శ్రీనివాసా! ఏడుకొండల వేంకటేశా'– అని ఎలుగెత్తి ప్రార్థించాడు. శ్రీవారెంతటి కరుణాహృదయుడు. భక్తజన బాంధవుడు!

శ్రీనివాసా అని ప్రార్థిస్తే చాలు! కనులముందు సాక్షాత్కరిస్తారు. కమలబాంధవుడు, కరుణాంతరంగుడు. అనుదినమూ లక్షలమందికి దర్శనం యిస్తున్నవాడు. కోరికలను తీరుస్తున్నవాడు. శరణు వేంకటేశా అంటే చాలు; అప్పటికప్పుడు అపారకరుణచూపిస్తాడు. వేంకటేశ సమోదేవో నాస్తి మహీతలే అన్నది సత్యం.

వేలకు వేలమంది, ఒక్కొక్క రోజున లక్షమంది కూడా ఆయన దర్శనం చేసుకుంటున్నారు. మా ఇలవేల్పువంటున్నారు. కలియుగదైవం ఆయనే! కలిమాయకు గురికాకుండా చేస్తున్నారు. వినావేంకటేశం ననాథో ననాథః అన్నది సత్యం! హరే వేంకటేశమ్ హరే వేంకటేశమ్ స్మరించండి నిత్యం! ●

## తల్లితండ్రులు వినా! వేరు దైవంబు లేరు! అన్నాడు వేమన యోగీంద్రుడు!

### సత్యమేవ ధర్మం! ధర్మమేవ జీవనం!

**ప్రథమమున మాతృదేవత**
**పదబడిజనకుండు నగును పరికింపనికన్**
**కుదురిన సదమలగురుడే**
**తుదిదైవము పెరలువేరు తోరమువేమా!**

–మొట్టమొదటి దైవం తల్లి, తరువాత జన్మనిచ్చిన తండ్రి, అటుపిదప గురువు. ఆ గురువు మామూలు గురువై ఉండరాదు. ఎంతో తెలిసినవాడూ, స్వార్థపరుడు కానివాడై ఉండాలి. ఎంతో తెలిసిన వాడై ఉండాలి. అలాటి ముగ్గురికన్నా వేరు దైవం లేదన్నాడు వేమన.

ప్రత్యక్ష దైవ స్వరూపులు తల్లితండ్రులే! వారి తరువాతే ఎవరైనా! తల్లితండ్రులను విడిచి అన్యులను కొలిచేవారిని యముడు రక్షించలేడు. తల్లితండ్రులను ఆదరిస్తూండేవారు ధర్మాన్ని అనుసరిస్తూన్న ధార్మికులు కావున అలాటి వారిని యముడు కూడా ఏఁవీ చేయలేడు. దేవుడు మాతృపితృ ఆరాధనాపరుల వెన్నంటి ఉంటాడు. ధర్మబుద్ధి ద్వారానే దైవానుగ్రహం పొందగలం– అంటాడు వేమన. తల్లిగర్భమందు తాను పుట్టినపుడు మొదట బట్టలేదు, తుదన లేదన్న జ్ఞానమూర్తి కూడా ధర్మానికి ఎక్కువ విలువనిచ్చాడు. తల్లితండ్రులు వినా దైవం లేదన్నాడు.

ఈ సత్యాన్నెరుగనివారు వేతేదో దైవము కోసం అన్వేషణ సాగిస్తుంటారు అన్నాడు వేమన.

చేతిలో వెన్నను పెట్టుకుని, వేరెక్కడో నేతికోసం వెదికినట్లుగా ఉందంటాడు వేమన.

**తల్లి తండ్రి పూజదారి గనుకకొంత**
**పాపకూపమందు పడుటేల?**
**దానధర్మములకు దైవంబుతానాయె**
**విశ్వదాభిరామ వినురవేమ–** అన్నాడు

సన్మార్గవర్తనుల పుణ్యమునకు ఆధారం దానగుణం. దానగుణమే దైవస్వరూపము. ఆ దైవస్వరూపులు ఎవరయ్యా అంటే ప్రత్యక్షముగా కనిపించే తల్లితండ్రులే! సదా పూజనీయులైన వారిని సేవించు.

**ధర్మబుద్ధి చేత దైవంబు తెలిసిన**
**కాలుడేమి చేయగలడు ప్రజల?**
**ధర్మమంటి వెంట దైవముగా నుండు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ధర్మాన్ని అనుసరిస్తూనే దైవము వెన్నంటి ఉంటాడు. అటువంటి ధర్మబుద్ధి కారణంగానే దైవాన్ని గ్రహించగలం. దైవబలం వెన్నంటి వుంటే యముడు మాత్రం యేఁవి చేయగలడు? యెపుడూ ధర్మాన్ని వీడరాదు.

**సత్యమే ధర్మం! ధర్మమేవ జీవనం!**

# డా॥ గరికిపాటి సాహితీవిలువల్ని పాటించడంలో మేటి! అందుకే వ్యాససారాంశమే ఘనపాటి.

# జీవితం ఒక చలనచిత్రం



దుఃఖాన్ని సంపూర్ణంగా పోగొట్టేలా శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత రెండో అధ్యాయంలో ఎంత చక్కగా చెప్పియున్నారో చూడండి.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత**
**అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా**

ఈ పద్యానికి భావం అర్థం కావాలంటే సినిమా తెర అర్థం కావాలి. తెరమీద సినిమా పడటం, మళ్లీ అయిపోవడం... ఇది అర్థం అయితే చాలు, ఈ పద్యం అర్థమవుతుంది. అప్పుడు మనం దుఃఖపడం. ప్రపంచమంతా ఒక మాయా స్వరూపం. ఈ మాయలో భాగంగా మన పనేదో మనం లీలా వినోదంలా హాయిగా చేస్తే సరిపోతుంది. ఈ ప్రపంచంలో జీవులు వ్యక్తమవుతున్నాయి కానీ, వాటి అసలు స్థితి అవ్యక్తం. ఉండటం వేరు, వ్యక్తం కావడం వేరు. ఒక పెద్దమనిషి ఇంటికి వెళ్లాం. ఆయన హాల్లో కనిపించారు. అంటే వ్యక్తమయ్యారు. అదే లోపలి గదిలో ఉన్నాడనుకోండి. ఉన్నాడా, లేదా మనకు తెలియదు. దీన్నిబట్టి ఉన్నది వ్యక్తం కాని పరిస్థితి కూడా ఉంటుంది. అదే మనకు దేవాలయం. పరమాత్మ అంతటా ఉంటాడు. దేవాలయంలో మాత్రమే వ్యక్తమవుతాడు. ఆ వ్యక్తమవడమే విగ్రహం. వైరులో విద్యుత్ ప్రవహిస్తుంటుంది. దానికి బల్బు పెట్టినపుడే వ్యక్తమవుతుంది. బల్బు లేకపోతే వ్యక్తం కాదు. అక్కడ విద్యుత్ లేదంటే ఎలా?

అవ్యక్తం నుంచి ఇవన్నీ వచ్చే వ్యక్తమవుతున్నాయి. మధ్యలో ఊరికే వ్యక్తమవుతున్నాయి. చివరకు మళ్లీ దాన్లోనే కలిసిపోతున్నాయి. అందుకే ఎవరో చనిపోయారని బాధపడటం ఎందుకు? ఇంతకు ముందు వాళ్లు లేరు. మధ్యలో వచ్చారు. మళ్లీ పోయారు. ఈ విషయం అర్థం చేసుకుంటే మరణం గురించి భయపడడం అనేది ఉండదు.

సినిమా వేయకముందు తెర అవ్యక్తం. సినిమా దానిమీద వ్యక్తం. రెండున్నర గంటలు కాగానే సినిమా మళ్లీ అవ్యక్తం. ఆ తెరయే భగవంతుడు. ఆయన మీద పడిన సినిమాయే ఈ ప్రపంచం. సినిమా శాశ్వతం కాదు. తెర శాశ్వతం. ప్రపంచం శాశ్వతం కాదు. భగవంతుడు శాశ్వతం. జీవితం ఒక చలనచిత్రం లాంటిది. జీవిత ఘట్టాలు చలనచిత్రంలో జరిగే ఘట్టాలే. అంతతేలిగ్గా జీవితాన్ని తీసుకోవాలి. మరి జీవితం చలనచిత్రం అయితే నిశ్చలన చిత్రం ఏదంటే అది ఆత్మ. ఆ ఆత్మకేసి చూసినపుడే మనకు ఇది చలనచిత్రం అర్థమవుతుంది. అందుకే శంకరాచార్యుల వారు ఇలా అన్నారు.

**'సత్‌సంగత్వే నిసంగత్వం నిసంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః'**

చేస్తున్న పనిపై దృష్టి పెట్టడం చాలా అవసరం. దీనికి నిశిత దృష్టి అవసరం. నిశిత దృష్టికి వయసుతో పనిలేదు. భర్తృహరి సుభాషితాలను తెలుగులో అందించిన ఏనుగు లక్ష్మణ కవి ఒక పద్యంలో ఇలా చెపుతున్నాడు.

**'విదలింప నురుకు సింగపు**
**గొదమయు మదమలిన గండ కుంజరములపై**
**నిది బలశాలికి నైజము**
**గద తేజో నిధికి వయసు కారణమగునే'**

తేజోవంతులు, పరాక్రమవంతులు బలప్రదర్శన చేయడానికి వాళ్ళ వయసుతో పనిలేదు. ఉదాహరణకు... ఒక సింహం అప్పుడే సింహం పిల్లను ప్రసవించింది. ఆ సింహం పిల్ల ఆ సమయంలో దగ్గరలో ఏనుగు ఉంటే కనుక దాని కుంబస్థలంపై దూకుతుంది. పైగా అది మామూలు ఏనుగు కాదు మదించిన ఏనుగు. మదించిన ఏనుగు చెక్కిళ్ల నుంచి ఒక రకమైన ద్రవం స్రవిస్తూ ఉంటుంది. ఆ ద్రవం తేనెలా ఉంటుంది. కానీ తేనె కాదు. దాన్ని మదం అంటారు. అలా మదించిన ఏనుగుపైకి సింహం పిల్ల కూడా దూకుతుంది. అది పరాక్రమవంతుల స్వభావం.

మనం పిల్లలను అలా సింహం పిల్లల్లా పెంచాలి. వాళ్లలో సొంత తెలివి తేటలను పెంచాలి. అదే సమయంలో వినయాన్ని నేర్పించాలి. అయితే పిల్లలను వాళ్ల ఎదురుగుండానే పొగడకూడదు.

**ప్రత్యక్షే గురవస్తుత్యాః**
**పరోక్షే మిత్రబాంధవాః**
**కార్యాంతే దాసభృత్యాశ్చ**
**పుత్రస్తు కదాచన**

తల్లితండ్రులు ఈ సూత్రం పాటించాలి. గురువును ముఖం మీదే పొగడొచ్చు. తప్పులేదు. మిత్రులను, బంధువులను ముఖం మీదే పొగడకూడదు. పరాయి వాళ్ల దగ్గర పొగడాలి. సేవకులను ముఖం మీద పొగడకూడదు. పరోక్షంగా కూడా పొగడకూడదు. అప్పగించిన పని పూర్తిచేసినపుడు మెచ్చుకోవాలి. ఇక కూతురును, కొడుకును ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎప్పుడూ పొగడకూడదు. దీర్ఘాయువుగా ఉండాలని ఆశీర్వదించాలి అంతే...! ●





## నాలుగు దశాబ్దాలకుపైగా 'నారాయణతే నమోనమో' అంటూ అన్నమాచార్య గీతాలాపనకే అంకితమైన శోభారాజు!

వేంకటేశ్వర సంకీర్తనాచార్యుడు అన్నమాచార్య గీతాలను వెలికి తీసిన వేటూరి ప్రభాకరశాస్త్రి మహోదయుడైతే, ఆ గీతాలాపనను నలుబది సంవత్సరాలుగా తనగాత్రం ద్వారా ప్రచారం చేస్తూన్నవారు మధుర గాయని శోభారాజ్.

తాను అన్నమయ్య గీతాలాపన ద్వారా వేంకటేశ్వరుని గానామృతధారల్ని ఆస్వాదిస్తూ, జీవితాన్ని తరింపచేసుకుంటున్నానని తిరుమల వేంకటేశ్వరునికే నివేదించుకున్నారని, కొందరు సన్నిహితులు చెబుతుంటారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారి అన్నమాచార్య ప్రాజెక్టులో ఆమె గాన ప్రస్థానం ప్రారంభమైంది. హైదరాబాదు లోని అన్నమయ్యపురంలో అన్నమాచార్య సమేత శ్రీ సర్వసిద్ధి వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మించి, అన్నమాచార్య భావనా వాహిని పేరిట, తాను విదేశాలలో 6 వేల సంగీత సభలను నిర్వహించడమేగాకుండా, 15 వేలమందికి భక్తి సంగీతంలో శిక్షణ యిచ్చారు. సంగీత కచ్చేరీలను చేయడమే గాకుండా దేశవిదేశాల్లో 6 వేలకుపైగా సంగీత కచ్చేరీలు చేసారు. వేలకొలదీ ప్రేక్షకులను రంజింపచేసారు. ఆరుపదుల వయసు వచ్చినా అలసట యెరుగని విదుషీమణి. శోభారాజ్ యొక్క అంకితభావమే ఆమెనంతటి ప్రఖ్యాత గాయనిని చేసింది. అన్నమయ్య సాంప్రదాయ సంగీతంలో అత్యున్నత స్థాయి కెదిగిన యీ మధుర మంజుల గాయనికి శుభాశీస్సులను తెలియచేస్తున్నాం. ●



## ఆచార్య గోపి

**ఎంతటి విద్యావంతుడో,
అంతటి వినయవంతుడు!
ఎంతటి విజ్ఞానవంతుడో,
అంతటి వివేకవంతుడు!
ఎంతటి స్థాయికి
ఎగసాడో, అంతటి
స్థాయికి తగ్గే
మాట్లాడేవాడు!**

కంచు మోగినట్లు కనకంబు మ్రోగునా అంటే ఎందుకు మోగవు!

మా అమ్మ మెడలో నగలు ఒకదాన్ని ఒకటి స్పృశించి, మోగేవి. కడ్డీకంటే, చంద్రహారములూ, గొలుసులూ, బలమైన మంగళసూత్రములూ, నల్లపూసలహారమూ, పగడాల తావళమూ ఒకదాన్నొకటి నడుస్తూన్నపుడు రాసుకుని అదో ఆనందభైరవి రాగంలా ధ్వనించేవీ! మొలపట్టీగా ఉన్న మువ్వల వడ్డాణమూ, కాళ్ళ కడియాలూ, పట్టాలూ నడుస్తూన్నప్పుడు రాసుకుని నవరసరాగ ధ్వని చేసేవి! అలా ఆచార్య గోపీ రచించిన గొప్ప గొప్ప నూతన కవితలు నానీలు జనని సరస్వతి ఆపాదమస్తక నగలై వగల వగల సొబరి సొగసుగా, సున్నితంగా, సులభంగా, సుమనోహరంగా కొత్త కొత్త ముగ్గుల మొగ్గలు తొడిగినవి. ముత్యాల ముగ్గు అందమా, బంగారు పాదములకు మరింత సింగార, శృంగార రసరంగ గజ్జెల రవళుల పట్టా అందామా- ఏ మందామా అనే ద్వివిధ సందేహం ఆయన్ను చూచినప్పుడల్లా నా మనసును రాపాడిస్తూనే ఉంది.

ఒక్కొక్కప్పుడు ముత్యాల మతాబుల రజిత వెలుగు రసరవ్వలు మరొకసారి కాకరపూవొత్తువంటి బంగారు రవ్వలూ నిటారుగా నిగనిగలాడుతూంటాయి.

నానీలు ఆయన్ను చూసి వ్రాసారో చూడకుండా వ్రాసారో నన్నది కలం పట్టిన ప్రతీవానికినీ అందమైన సమస్యతో దొలిచేస్తున్నది. అందులో నేనూ నొకడిని అని చెప్పడానికి సంశయించడం లేదు.

గోపీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా ఉన్నప్పట్నుంచీ చూస్తున్నాను. ఆ అసమాన సామాన్యతను మరెవ్వరి వద్దరూ కనిపించదు.

ఏఁవిటీ విచిత్రం- ఆడంబరమైన ఈ ఉద్యోగంలో యింత అంబరం చుంబించేంత నిరాడంబరంగా ఉన్నాడేఁవిటా- యని ఆశ్చర్యపోతూండేవాణ్ణి. ఇంటి అరుగుమీద కూడా ఆయన పత్రిక చదువుకుంటూన్నప్పుడూ అలాగే అంత నిరాడంబరంగానూ ఉన్నాడు.

ఉద్యోగంలో ఉన్నప్పుడూ, ఉద్యోగం విరమణానన్తరమూ ఒకే సాదాసీదాలో కనిపించడం ఆయనకే చెల్లింది. మనిషిలోని సౌజన్యత, సహృదయతా వన్నె పెరిగిందేగానీ తరగలేదు. గోపీకి గోపీ సాటిగానీ మరెవ్వరూ కారు.

ఈ ఆచార్యుడు కొన్ని వందలు, వేలపేజీలు వ్రాసాడు, ఏ రచనాభావన లోనూ రాజీపడలేదు. ఎవరి అదుపు ఆజ్ఞలకూ లోబడలేదు. స్వతంత్ర భావాలే తక్క అన్యదా ఎవరి భావాలకూ లోనూ కాలేదు. కవి స్వతంత్రు డనడానికి గోపీయే చక్కని ఉదాహరణ. గోపీకి నా శుభాశీస్సులు.●

# కాసుల కాశబడని కాసల నాగభూషణం



**- కాసులు కురిపించే మాటలూ, వాక్మాధురమూ ఆయన స్వంతమైనప్పటికినీ ఏనాడూ ఆయన కాసుకొరకు వాడుకున్న సందర్భాలు కనిపించవు! -**

మధురోక్తి గల వాక్చాతుర్యమున్నా వాటినేనాడూ సొమ్ము చేసుకున్న దాఖలాలూ కనిపించలేదు!

మధుర వాచస్పతుడు! అధరమునెపుడూ ఆనందము చిలికింపచేయు వాడు! చిన్మయానందుడు!

వ్యక్తి సంఘజీవి! సామాజిక ధర్మాల ననుసరించి వైయక్తిక జీవితాన్ని గడపడం తనకూ సమాజానికీ శ్రేయస్కరమని నమ్మినవాడు.

ఆయన పుట్టిన కార్వేటి నగరం రాజుల పాలనలో సాహితీ సుక్షేత్రంగా ప్రసిద్ధిగాంచినది. కార్వేటి నగరపాలకులు విద్యాపోషణలో అగ్రగణ్యులు. ఆనాటి సంస్థాన పాలకుడు రాజాకుమారస్వామిరాజు నాగభూషణం తాతగారైన వెంకటస్వామి సాయునికి మేడను నిర్మించియిచ్చారు. ఆనాటి పాలకులు అంతటి ఔదార్యం కలవారు. తమ క్రింది ఉద్యోగులను ఎంతో గౌరవంగా ఆదరించేవారు. వారి సౌభాగ్యం తమ సౌభాగ్యంగా భావించేవారు.

కార్వేటి నగరంలో విద్య ప్రారంభం చేసిన నాగభూషణం రెండు ఊర్లలో పెరిగారు. హైస్కూలు చదువులకోసం మూడు ఊరులు మారారు. ఈ గ్రామాలన్నీ తిరుపతి చెన్నయ్ రహదారిలో ఉన్నాయి. ఆయన విద్యాభ్యాస సమయంలోనే రాజమహలు పెద్ద కోనేరు, కాశీతోట, గజరాజులు నీరు తోడిన మోటబావి వేణుగోపాలస్వామి వారి ఆలయం, ఆలయం చుట్టూ ఉండే కొండలు మధ్యలో ఓ కొండదారి (ఘాట్‌రోడ్డు) ఇవన్నీ కాసలవారి చిన్ననాటి విహారస్థలాలు. అవన్నీ ఆయన విహారతర వ్యాసంగానికి విహంగ వీక్షణమయ్యింది. వెలసి విహరించిన మేఘాలు విరిసిన సంధ్యకు ప్రాతిపదికయింది. అప్పట్లో సాహితీ ఆరాధకులను ప్రోత్సహించిన ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక ప్రచురించి, గజ్జెపూజ చేసినట్లయినది.

కాసలవారు తన సాహితీగురువు ఆనాటి అభ్యుదయ కవి నూతలపాటి గంగాధరం గారని చెబుతారు. కాసలవారు నింద్రలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నప్పుడు నూతలపాటి గంగాధరంగారు తెలుగు ఉపాధ్యాయునిగా వచ్చారు. కాసలవారిని పద్యాలు వ్రాయమనీ, పత్రికల్లో అచ్చయిన రచనల్ని క్లాసుల్లో చదివి వినిపించమనీ ప్రోత్సహించారు. పద్యాలు వ్రాయడంలో కాసలవారు ప్రతిభాసంపన్నులయ్యారు. అలా అలా ఆయన తిరుపతి ఎస్వీ ఓరియంటల్ కళాశాల్లో విద్వాన్ అధ్యయనం, మొదటి ర్యాంకు, విశ్వవిద్యాలయ బంగారుపతకం పొందడం, కాసలవారి జీవితంలో బంగారు శకం ప్రారంభమైందని సంతోషం పడుతూ స్వర్ణయుగం ప్రారంభమైందని భావిస్తూన్న సమయంలో గురువు గంగాధరంగారు పాము కరిచి చనిపోవడం, తరువాత ఏడాది కాలంలో కాసలవారి పెదనాన్న, నాన్న పరమ పదించడంతో ఆయన పరిస్థితి తారుమారయింది. కొన్ని అనుకున్నవి అనుకున్నట్లుగా జరగడం, తారుమారు కావడంతో జీవన సరళి మారిపోతుంది. జీవన పయనంలో మార్పు వస్తుంది, అలాటి పరిస్థితి కాసలవారికి తటస్థించడంతో ఆయన మకాము కాముగా చెన్నపట్నం చేరేలా చేసింది. విపత్కర పరిస్థితుల్లో చెన్నపట్నం చేరిన ఆయనకు చెన్నపట్నం ఆయనకో విశిష్టస్థానాన్నిచ్చింది. ఆయన పెత్తల్లి చెన్నపట్నంలో ఉండడంతో తేనెపాత్రలో రొట్టెపడినట్లయింది. టి.నగర్ పానగల్లు పార్కుకు అబిముఖంగా ఉన్న శ్రీరామకృష్ణమిషన్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేసే అవకాశం కలిగింది. అప్పుడే మా రెండవ అబ్బాయి నారాయణరావుకు తెలుగు ఉపాధ్యాయునిగా చూసే అవకాశం కలిగింది. అటు తరువాత డి.జి. వైష్ణవ కళాశాలలో లెక్చెరర్‌గా పనిచేస్తూ, యాజమాన్యం ప్రశంసలందు కోవడం చూసాను.

అలా ఆయన శుక్లపక్ష శశాంకుని శోభలను చూస్తూ వచ్చాను.

మనిషి పెరుగుతూన్న కొద్దీ మనిషిలో పెరుగుతూన్న మంచితనం చూస్తూ వస్తున్నాను.

1980లో ఆయన మేనమామ ప్రసాద్‌గారి కుమార్తె సౌ॥ కిరణ్మయిని పరిణయమాడడం, ఒక కుమార్తె సౌ॥సాయిమనోజ్ఞ ఒక కుమారుడు చి॥సాయిప్రత్యూష ఉన్నారని– సంతానం విషయంలో కూడా ఒక కుమార్తె, ఒక కుమారుడన్న విషయాల్ను బట్టి పరిమితిగల కుటుంబ వ్యవస్థీకృతుడని కూడా తెలుసుకుని ఆ చంద్ర తారార్కమూ కీర్తి ప్రతిష్టలతో వర్థిల్లాలన్నీ ఆశీర్వదిస్తున్నాను. మంచితనం తన వొక్కనిలోనే గాకుండా, నలుగురిలోనూ పంచేట్లు ప్రయత్నించమని సలహాయిస్తున్నాను.

త్యాగరాజనగర్ పానగల్‌పార్కు ఎదురుగా ఉన్న రామకృష్ణా మిషన్ వారి హయ్యర్ సెకండరీగ్రేడ్ పాఠశాలలో చూశాను. మా రెండవ అబ్బాయి నారాయణరావు తరగతికి తెలుగు ఆచార్యునిగా వచ్చిన జ్ఞాపకం ఉన్నది. జ్ఞాపకానికి మరో బలమైన కారణం కూడా ఉన్నది. ఆయనెపుడూ లే చిరునగవుతోనే కనిపించేవారు. ఎప్పుడూ చిరాకు అనేది ఆయన మోములో కనిపించేదికాదు. ఏ విషయము మాట్లాడినా, ఆయన పెదవులపై చిరునగవే చిందులాడేది; చిరు బుసబుసలు కనిపించేవి కావు. చిరుభూషణుడని పేరు పెట్టడానికి బదులు నాగభూషణుడు అని పేరు పెట్టారనుకున్నాను. నాగభూషణునిగా పేరుపొందిన పరమేశ్వరుని మోము ప్రశాంతంగా ఉన్నట్లు పురాణాలు పేర్కొన్నాయ్. వాటినీ నాగభూషణుడు సార్థకం చేసాడనుకుంటూ ఉంటారు.

- గోటేటి

## చేరదీసిన చెన్నపట్నం

మా అమ్మకు అక్క (పెద్దమ్మ) కుటుంబం చెన్నైలో స్థిరపడడంతో అప్పటికే మద్రాసు బాగా నాకు అలవాటు అయింది. ఇక్కడి టి.నగర్‌లో శ్రీరామకృష్ణ మిషన్ హైయ్యర్ సెకండరీ(మెయిన్) పాఠశాలలో పండిట్ ఉద్యోగం లభించడం జీవితంలో తొలి మెట్టు ఎక్కినంత ఆనందం. బీఎ(ఇంగ్లీషు), ఎం ఎ(తెలుగు) పూర్తిచేశాను. దీంతో ఆ స్కూల్లోనే పీజీ అసిస్టెంటుగా ప్రమోట్ అయ్యాను. టీఎన్‌పీఎస్‌సీ తమిళ పరీక్ష ఉత్తీర్ణత అయ్యాను. దాదాపు పన్నెండేళ్ల స్కూల్ సర్వీస్‌తో, డి.జి.వైష్ణవ కళాశాలలో అదనపు క్వాలిఫికేషన్‌తో లెక్చరర్ అయ్యాను. కొన్నేళ్లకు అసిస్టెంటు ప్రొఫెసర్‌గా, తదుపరి అసోసియేట్ ప్రొఫెసర్‌గా, తెలుగు విభాగం అధ్యక్షహోదాలో 2011లో రిటైర్డ్ అయ్యాను. ఇక, ఉద్యోగం వచ్చిన రెండేళ్లకు (1980) ఓ ఇంటి వాడినయ్యాను. మేనమామ వల్లిగారి రాంప్రసాద్ కుమార్తె కిరణ్మయి నా జీవితంలోకి అడుగు పెట్టింది. మాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె సాయిమనోజ్ఞ, కుమారుడు సాయి ప్రత్యూష్.

# రాజపోషణ లేనిదే ఏ భాషా రాణించదు!

## ఏ వాఙ్మయమూ వర్ధిల్లదు! రాజరాజ నరేంద్రుని కారణంగానే తెలుగు భాష వర్ధిల్లింది! తెలుగు వాఙ్మయం ప్రవర్ధిల్లింది! -మహాభారతం వంటి కావ్యమూ నన్నయ్య వంటి మహాకవులూ ప్రవర్ధిల్లారు! నాటికీ నేటికీ రాజమహేంద్రవరమూ సాహితీ కాణాచే!

ఆనాటి నన్నయ భట్టారకుణ్ణి ఆదికవియని ప్రస్తుతించారు. మహాభారతాన్ని ఆదికావ్యమన్నారు.

మహాభారతంలోని పాండవులను రాజరాజనరేంద్రుని పూర్వులని నన్నయ్య ప్రస్తుతించారు. ఆ ప్రస్తుతింపే మహా భారతరచనకు ప్రారంభమైంది. రాజమహేంద్ర వరం సాహితీ కాణాచియైంది! ఆంధ్ర రాష్ట్రపు తొలి ఆస్థానకవిగా శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు తొలి ఆస్థాన కవిసామ్రాట్పీఠాన్ని అధిష్ఠించారు. తిరుపతి వేంకట కవులు వారి శిష్యులే! వారి శిష్యులే కవిసామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ.

అలా వారి శిష్య ప్రశిష్యగణం తెలుగునాట సాహితీ సేద్యం చేస్తూ వచ్చింది.

రాజమహేంద్రవరపు సాహితీ క్షేత్రాన్ని అద్దేపల్లి రామమోహన్‌రావు వంటి సాహితీ పోషకులు ప్రోత్సహించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి ప్రముఖ నాటకరచయితలూ, కందుకూరి వీరేశలింగం వంటి సంఘసంస్కర్తలూ, గౌతమీ గ్రంధాలయం వంటి ఉత్తమ గ్రంధాలయములు వర్ధిల్లిన వంటే రాజరాజనరేంద్రుని పాలనమూ, నన్నయ భట్టారకుడు నడయాడిన ప్రదేశం సాహితీ కాణాచి కావడమే అట్టి రాజమహేంద్రవరంలో పుట్టి పెరిగినటువంటి పత్రికలు ఏ పట్టణంలోనూ పూట్టనూలేదు ప్రవర్ధిల్లనూ లేదు.

అక్కడ పుట్టి పెరిగిన రచయితలూ కళాకారులే దేశంలోని పలుప్రాంతాల్లో వర్ధిల్లారు. నవలా సాహిత్యం అక్కడే పుట్టింది. కొవ్వలి, జంపన, మానాపురం వంటి నవలా రచయితలు అక్కడ కుసుమించినవారే!

నిడమర్తి వారి కుటుంబం అక్కణ్ణుంచే సినిమా పరిశ్రమను అభివృద్ధి పరిచింది. డా॥ రాజారావు వంటి ప్రముఖులు అక్కణ్ణుంచే ఎందరో మహా నటీనటులను చలనచిత్ర పరిశ్రమకు అందచేసారు. మద్దూరి అన్నపూర్ణయ్య, క్రొవ్విడి లింగరాజు వంటి పత్రికగా రచయితలు అక్కడ నుంచే సాహితీ, వార్తా పత్రికలను ప్రకాశింపచేసారు.

సాహితీ కళారంగాల కాణాచిగా రాజమహేంద్రవరం అభివృద్ధి చెందడమే గాకుండా, ఎందరో మహానుభావులను దేశసేవకు అందచేసింది. పెక్కుమంది సినిమా కళాకారులు రాజమహేంద్రవరం నుంచీ చెన్నయ్‌కు వలస వచ్చారు. దేశరాజధాని ఢిల్లీ వరకూ వారి ప్రతిభ విస్తరిల్లింది. వారి సేవల్లో దేశం పునీతమైంది.

రాజమహేంద్రవరమా! నీవెప్పటికినీ రాజరాజమహేంద్రుని వరప్రసాదితమే! నన్నయ భట్టారకుని అకుంఠిత తేజోప్రకాశితవే!

తెలుగు వాఙ్మయ చరిత్ర నన్నయ భట్టారకునితోనే ప్రారంభమైంది కారణం ఆయనకు తూర్పు చాళుక్య రాజగు రాజరాజనరేంద్రుని అద్భుత సహకారము లభించుట వల్లనే తెలుగు వాఙ్మయ చరిత్రకు శ్రీకారము చుట్టబడినది. రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి నన్నయ్య భట్టారకుడు. ఆయన రాజమహేంద్రవరమును రాజధానిగా చేసుకుని వేంగీరాజ్య విస్తరణ చేసాడు.

రాజరాజనరేంద్రుడు 1022 నుంచీ 1063 వరకూ వేంగీ రాజ్యమును పాలించాడు.

క్రీ.శ 1000 నుండీ 1200 వరకునూ గల ఆచార వ్యవహారములే గ్రంథస్థమైనందున అప్పటి ఆ రాజరాజనరేంద్రుని కాకతీయుల స్వర్ణయుగముగా పరిగణింపబడియుండెను. రాజరాజనరేంద్రునికి 400 ఏండ్ల పూర్వము బౌద్ధమతము వ్యాప్తిలోనున్నట్లు కొందరు చరిత్రకారులు వ్రాసిరి.

నన్నయ్యగారు రాజరాజనరేంద్రుని ఆస్థానమున ప్రధాన వ్యవహారములను చూడబట్టి అతఃపూర్వం వ్యాప్తిలోనున్న బౌద్ధమతానికి చరమగీతం పాడడం జరిగింది. గాకున్ననూ మహాభారత రాజులు చాళుక్య సంతతి పూర్వులని నన్నయ్యగారు బోధించడం ఒక రకమైన సత్యం రాజరాజనరేంద్రుని మస్తిష్కములో నిక్షిప్తమై ఉన్నది. అప్పటి వరకూ, సూర్య చంద్రవంశపు రాజులే పాలిస్తూ వచ్చారు. ధర్మప్రభువులుగా కీర్తిగాంచారు. చక్కని సాహిత్యం రాజరాజనరేంద్రుని కాలములోనే ప్రోత్సహింప బడింది. పోషింపబడింది. నన్నయ్యగారు మహాభారతరచనకు సంక్రమించడం రాజరాజ నరేంద్రుని ప్రోత్సాహంతోనే జరిగింది. రాజమహేంద్రవరం సాహితీ కాణాచిగా నిలిచింది. నాటికీ నేటికీ రాజమహేంద్రవరం కళాసాహితీరంగాల కాణాచి!

నన్నయ భట్టారకుని అకుంఠిత సేవా విశిష్టతల కారణంగానే, తిక్కన ఎర్రనలు శేషించిన మహాభారత రచనములు పూర్తిచేసారు. మహాభారతగ్రంథం ప్రాతిపదికగా తీసుకునే దేశంలో ఎంతో భారత సాహిత్యం విస్తరిల్లింది.

మహాభారతంలోని అంతర్భాగాంశమైన భగవద్గీత మహాత్మాగాంధీ వంటి నాయకులు రూపొందడానికి కారణమైంది. అర్జునుని వంటి వీరకిశోరముల్లా, నేతాజీవంటి వీరస్వభావులూ వల్లభాయ్ పటేల్ వంటి రాజతంత్రజ్ఞులూ వెలసారు, విలసిల్లారు.

ధర్మరాజు రాజసూయయాగం చేసి రాజ్యాలు జయించినట్లు వల్లభాయ్ పటేల్ దేశంలోని స్వతంత్ర సంస్థానాలను జయించి, ఏకభారతదేశ నిర్మాణం చేసారు. కొరకురాని కొయ్యగా ఉన్న నిజాము సంస్థానంపై రాత్రికి రాత్రి సేనల్ని పంపి, భారత్ రిపబ్లిక్ యూనియన్‌లో విలీనం చేసిన ఘనత వల్లభాయ్ పటేల్‌దే!

పటేల్ ఈ దేశ ప్రధానియైతే ఈ దేశ భవిష్యత్ మరోలా ఉండేది, దేశం రెండుగా చీలేది కాదు. ఏకదేశ నినాదం వర్ధిల్లేది

ఏకదేశం, ఏకప్రజ, ఏకభావం అనే త్రైయిక భావరూపంగా సత్యం వర్ధిల్లాలి. సత్యం అను మూడక్షరముల విభాజ్యము పదమూడు విభాజ్యములుగా వర్ధిల్లాలి. అలా వర్ధిల్లిన నాడు దేశంలో ఏకతాభావం వర్ధిల్లుతుంది. రాష్ట్రాల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. అట్టి అన్యోన్యతాభిమానాలు పటిష్టంగా ప్రకటితమైననాడు భరతఖండం మహోజ్వలంగా భాసిల్లుతుంది. భరతవర్షమున నిరంతరమూ బంగారం వర్షిస్తుంది. భరతఖండమా! భరతవర్షమా! నీ విశాల భూమి నందు వ్యవసాయమూ ఫలసాయము నందు కొనుగాక! భరత ప్రజలు సర్వకాలములందూ, సకలైశ్వర్యసౌభాగ్యములను చేకొందురుగాక! అస్తు! శుభమస్తు! సకలైశ్వర్య సౌభాగ్యమస్తు! మంగళమస్తు! ●

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station), TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**

# ధర్మాన్ని వ్యతిరేకిస్తే అధర్మమవుతుంది!

## అధర్మాన్ని ఆచరిస్తే సర్వము నాశనమవుతుంది!

మనిషి మర్మము తెలుసుకో!
నీలోగల ధర్మము తెలుసుకో!
- దేవుడెకడో కొండకోనల
దాగెనంటూ చూడవోకు!
మహాకవి గురజాడ చెప్పిన
మంచి మాటలను గుర్తుంచుకో!
మంచిని యించుక పెంపొందించుకో!
మానవత్వం లేని జాతికి
మనుగడ లేదని తెలుసుకో!
దేశమంటే మట్టికాదని
దేశమంటే మనుషులని
అడుగడుగునా తలంచుకో!
ధర్మాన్ని ఎదిరిస్తే అది అధర్మమే
అవుతుందని భావించు!
అధర్మము వ్యక్తినాశక కారణమని గ్రహించు!
ధర్మ ఏవహతో హన్తి ధర్మో రక్షతి రక్షితా
తస్మాధర్మో న హన్తవ్యో మానో ధర్మోహతోఽ వధీత్!

అన్నది మనుస్మృతి.

ఈ మనుస్మృతిని సదా మనస్మృతికి తెచ్చుకుంటూ ప్రవర్తించిననాడు ధర్మము వ్యక్తిని కాపాడుతుంది.

ఏ ప్రాణినీ హింసింపకూడదనేది మొదటిధర్మం. ఎప్పుడూ అబద్ధం ఆడరాదన్నది రెండవధర్మం. మహాభారతంలో జననాశనం గాకుండా ఉండడానికి ఎప్పుడూ అసత్యమాడని ధర్మరాజుచే అశ్వద్ధామ హతః అనిపించినా మెల్లిగా కుంజరః అనిపించారు. అశ్వద్ధామ హతః అనకపోతే ద్రోణుడు శరఃసంధానం చేసేవాడు కాదు. ద్రోణుడలా శరసంధానం చేస్తూంటే పాండవ పక్షంలోని మంచి వాళ్ళెందరో చనిపోయేవారు. అందుచేత అశ్వద్ధామ హతః– అని ఘట్టిగా అనిపించి అసత్యదోషం తగలకుండ ఉండడానికై 'కుంజరః' అని మెల్లిగా ధ్వనింపచేసారు.

అశ్వద్ధామ హతః అనకపోతే ద్రోణుడు బాణాలను సంధించడం మానేవాడు కాదు. కొంతలో కొంతయినా అసత్యదోషం తగ్గడానికి 'కుంజరః' అనిపించారు.

ఎప్పుడూ ఏ ప్రాణినీ హింసించరాదు. ఎప్పుడునూ అసత్యము పలుకరాదు. ఎవరికినీ అహితముగ నుండరాదు. ఎవరిపట్ల అప్రియవచనములు పలుకరాదు. ఎన్నడునూ దొంగతనమూ చేయరాదు. ఏ ప్రాణినీ హింసించరాదు. సకల ప్రాణులందునూ స్నేహభావముతోనే చరించవలెను. ఎంతో దుర్లభమూ, అదృష్టకరమైన ఈ మనుష జన్మను పొంది ఏ ప్రాణితోనూ వైరము పెట్టుకోరాదని మనుధర్మశాస్త్రము చెబుతూన్నది. ఎవడు తన సుఖమును వాంఛిస్తూ, ఇతర ప్రాణులను హింసించునో అతడు జీవించిననూ మరణించిననూ సుఖపూర్వకపు ఉన్నతిని పొందడని సుస్పష్టము చేస్తున్నది.

మనసు చెప్పినట్లు పదము పదగమనము చేస్తూంటుంది – అనడంలో మార్గనిర్దేశనమును మనస్సే చేస్తున్నది. మనసును అదుపులో పెట్టకలిగిన శక్తి మనిషిలో ఉన్నప్పటికినీ నియంతగా (డిక్టేటర్) మార్గనిర్దేశం చేసే మనస్సు నెదిరించలేకపోవడం మనిషి యొక్క నిశ్శక్తతకు కారణమవుతున్నది. మరో ప్రమాదకరమైన కారణం మాంసభక్షణమంటారు. తన జీవితమనుగడకోసం మరో జీవిని సంహరిస్తున్నానని, అది పాపరూపకమైన హింసయని భావించియు ఆ పరిత్యజించకుండా, బుద్ధిపూర్వకంగా హింసాకార్యం చేస్తున్నాడంటే స్వర్గ, సాధనకు ప్రతిబంధకమని గ్రహించలేకపోవడమే!

ఏ ప్రాణికినీ పోవాలని ఉండదని తెలియును తెలిసుండీ చేయడం తప్పిదం. జ్ఞానముండీ చేయడం మహాతప్పిదం.

ప్రాణరాశుల్లో ఒక్క మనిషికే భగవంతుడు జ్ఞానాన్ని ప్రసాదించాడు. విచక్షణా జ్ఞానం యిచ్చాడు. ప్రాణమనునది తృణము(గడ్డి) నుండిగానీ కాష్టము(కట్టెలు) నుండిగానీ, శిలలు (రాళ్ళు) నుండీగానీ ఉత్పన్నం కావడం లేదు కదా! ప్రాణులను హింసించడం, హత్యచేయడం మూలంగానే ప్రాప్తించుచున్నది. అది దారుణమైన హత్యాదోషము ప్రాప్తింపచేస్తున్నది. అది అత్యంత మహాదోషము, దోషకరము.

ధనము చేత బంధించి చంపడము భుజించడం– అనే మూడు విధములుగా మనిషి తప్పు చేస్తున్నాడు, ప్రాణి హింస తప్పని తెలిసి కూడా ప్రాణమున్న మనిషి భావించడం లేదు.

ప్రాణుల్లో మాట్లాడకలిగే శక్తి, గ్రహింపు, తెలివితేటలు ఒక్క మనిషికే ఉన్నాయ్. మాట్లాడగలిగిన మనిషే తప్పు చేసిననాడు, ఏ ప్రాణి ఆ పనిని 'తప్పు' అని చెప్పగలదు; హెచ్చరించగలదు?

తప్పు అని తెలిసీ తప్పు చేస్తున్నాడంటే, అధర్మాన్నెదిరించగల శక్తి ఉన్న మనిషి, అధర్మాన్ని వ్యతిరేకించకపోవడం చూస్తూంటే, ఉద్దేశపూర్వకంగానే అధర్మ బాటపడుతున్నాడని చెప్పవలసి వస్తుంది.

కట్టెనున్న నిప్పు కట్టెను కాల్చినట్టు భావించాలి. కట్టెలో నిప్పు ఉన్నా నివురుగప్పి ఉండడం వలన లేనట్టు కనిపిస్తుందంటే పైకి మంచివానిగా మనిషి కనిపించాలనుకోవడంతో మనిషి యొక్క దుర్నీతిని తెలుసుకోవడం కష్టమవుతున్నది. కానీ ఆ దుర్నీతి అతనినే కాల్చివేస్తుందని తెలుసుకోలేక పోతుండడం దురదృష్టకరం, ధర్మవిరుద్ధమనీ తెలుసుకోవాలి! అదే ఆ వ్యక్తినీ, ఆ వ్యవస్థను, నాశనం చేస్తుందని తెలుసుకోవాలి. ●








# సినిమా రంగానికి సాహితీవన్నెలు గూర్చిన వెన్నెలఱేడు
# దాసరి నారాయణరావు మా పాలకొల్లువాడు

**త**న కలాన్ని హలంలా సాహితీ క్షేత్రంగా తీర్చిదిద్దిన ఆచార్య ఆత్రేయ నేను నిర్మించిన చిత్రానికి కోరి పాటను వ్రాసిన ప్రాతః స్మరణీయుడు!

**తె**లుగు చిత్ర నిర్మాణంలో ఎందరో పాలకొల్లు వారు సాహితీ శిఖరాగ్రానికి చేరుకున్నారు.

పినిశెట్టి శ్రీరామమూర్తి చలనచిత్ర రంగ ప్రవేశంతో పాలకొల్లు వారెందరో సినిమా రంగం ప్రవేశించి, ధృవతారల్లా రాణించారు. అల్లురామలింగయ్య, పినిశెట్టి, మల్లాది సత్యనారాయణ, చలం యిలా చెప్పుకోవాలంటే ఎందరో తమదైన ముద్రను వేసుకున్నారు.

దాసరి నారాయణరావు గారైతే ఒక ప్రత్యేక శకానికి శ్రీకారం చుట్టారు. ఆయన కథారచయితగా, సంభాషణల రచయితగా, దర్శకునిగా, నిర్మాతగా, నటునిగా చేసిన బహుపాత్రాభినయం మరే ఇతరులూ సాధించి, విజయహస్తం చేజిక్కించుకోలేదని చెప్పాలి. ఆయన కథను వ్రాసి, సంభాషణలు రచించి దర్శకత్వం వహించినన్ని చిత్రాలు మరే కళాకారుడూ సాహసించలేదనే చెప్పాలి. ఆయనలా కథనూ, సంభాషణలు రచించి, దర్శకత్వం వహించినవారు భారతదేశ చలనచిత్ర చరిత్రలో లేరనే చెప్పాలి.

చలనచిత్ర రంగంలో ఆయన సవ్యసాచి. ఎందరో రచయితల్ను, దర్శకులను, నటులను తెలుగు చలనచిత్ర పరిశ్రమకు అందచేశారు. అతి స్వల్ప కాలంలో అత్యున్నత శ్రేణిలో, అసంఖ్యాకమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన కీర్తి దాసరి కొక్కనికే దక్కింది. ఆయన తొలి దర్శకత్వం చేసిన చిత్రం, కథాకథనం సంభాషణలు వ్రాసిన తొలి చిత్రం 'తాతామనవడు' సంవత్సర కాలానికి పైగా విజయ విహారం చేసింది. చిన్న చిన్న నటులతో బాటు, పెద్ద పెద్ద నటులతో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన ఖ్యాతి ఆయన ఒక్కరికే దక్కింది. మరెవ్వరూ ఈ సంఖ్యను అధిగమించలేదన్నది నూటికీ నూరుపాళ్ళ సత్యం. ఆయన దర్శకునిగా ఉంటూనే, ఎందరో సహాయకులను దర్శకులుగా తీర్చిదిద్దిన ఖ్యాతి ఆయనదే. మొత్తం చలనచిత్ర పరిశ్రమ చేయని, చేయలేని అపార కృషిని ఆయనొక్కరే చేసారు.

రచయితగా, దర్శకునిగా, నటునిగా, నిర్మాతగా బహు రంగాల కృషిని ఆయన భుజాలకెత్తుకున్నారు. వాటిలో ఆయన విజయాన్ని సాధించారు. ఆ విజయం సాధారణ విజయం కాదు; అసామాన్య విజయం. భారత చలనచిత్ర రంగంలో ఎవరూ సాధించని విజయం. చిన్న చిన్న నటులతో, కొత్త నటీనటులతో ఆయన చిత్రాలను నిర్మించి అపూర్వ విజయాన్ని సాధించారు. ప్రఖ్యాత నటులతో ఆయన చిత్రాలు నిర్మించినప్పటికినీ, ఆ నటీనటుల ముద్రకన్నా తన ముద్రే ఎక్కువగా ఉండేది. ప్రేమనగర్ చిత్రంలో నటించిన అక్కినేని నాగేశ్వరరావు గారితో అంతకన్నా విశిష్టమైన చిత్రాన్ని నిర్మిస్తానని ప్రేమాభిషేకం నిర్మించి వాగ్దానాన్ని వాస్తవం చేసారు. దాసరికి సరి దాసరేగాని మరెవ్వరూ సరిరారని నిరూపించిన దాసరి ప్రాతఃస్మరణీయుడు. ●


**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



## విద్యాప్రకాశనందగిరి స్వాములవారి భాషణములనే నిత్యభూషణీయములుగా భావిస్తూండడమే గాకుండా నిత్య అనుసరణీయములని వక్కాణిస్తున్నాను!

మంచి ఎంత చేయగలవో- అంత చేయుము
ఎన్ని విధముల చేయగలవో- అన్ని విధముల చేయుము
ఎన్ని చోట్ల చేయగలవో- అన్ని చోట్ల చేయుము.
ఎన్నిసార్లు చేయగలవో- అన్నిసార్లు చేయుము.
ఎంతమందికి చేయగలవో- అంతమందికి చేయుము!
ఎన్ని మార్గముల ద్వారా చేయగలవో- అన్ని మార్గముల చేయుము!
ఎంతకాలము చేయగలవో- అంతకాలమూ చేయుము
–పై సప్తమార్గములూ సప్తపదివంటివి!

వివాహక్రతువులో ఏడడుగులు కలిసి నడవడమెంత ముఖ్యమో, జీవనయానంలో జనులందరూ కలిసి ఏడడుగులు వేయడం అంతముఖ్యం. విశ్వజనులు పైన దెలిపినట్లు ఏడడుగులూ వేసినచో విశ్వశాన్తికి వెలుగుబాటను వేసిన వారే అవుతారు. ●

# భగవంతుడు 24 అవతారము లెత్తినట్లు శ్రీమద్భాగవతం వివరించింది

1. సనక సనందన, సనాతన సనత్కుమారావతారం, 2. వరాహావతారం, 3. నారదావతారము, 4. నారాయణావతారము, 5. కపిల దేవుని అవతారము, 7. యజ్ఞ భగవానుడు, 8. ఋషభదేవుడు, 9. పృదు మహరాజు, 10. మత్స్యావతారం, 11. కూర్మావతారము, 12. ధన్వంతరి భగవానుడు, 13. మోహిని యవతారము, 14. నృసింహావతారము, 16. పరశురామావతారము, 17. వేదవ్యాసుడు, 18. శ్రీరామావతారము, 19. బలరామావతారము, 20. శ్రీకృష్ణావతారము, 21. బుద్ధావతారము, 22. కల్కి అవతారములు. కానీ భాగవతానుసారంగా హంసావతారము, హయగ్రీవాతారము మరి రెండవతారములను చేర్చి 24 అవతారములుగా చెప్పారు. పద్మపురాణం ప్రకారం పది అవతారములనే వక్కాణించారు.

మత్స్యావతారం, కూర్మావతారం, వరాహావతారం, నారసింహావతారం, వామనావతారం, రామావతారం, కృష్ణావతారం, బుద్ధావతారం, కలికావతారంలని చెబుతున్నారు. అయితే బుద్ధుడు గౌతమీ బుద్ధుడా అన్నది ప్రశ్నగానే ఉన్నది. కల్కి అవతారం ధరించాడా లేదన్నదీ బృహత్ప్రశ్నే! కృష్ణావతారం అవతారం కాదనీ, కృష్ణుడే స్వయం భగవానుడనీ ఆయన ద్వారకలోనూ ఉన్నాడు, బృందావనంలోనూ రాసలీలలకు వస్తూంటాడనీ చెప్పడం ఉన్నది. దర్శించినవారు కూడా ఉన్నారు. పరమాత్ముడైన ఆయన పరమ పుణ్య పురుషులకు దర్శనమిస్తూనే ఉన్నాడు. చాలామంది విశ్వసిస్తున్న సత్యమిది. ●

### ప్రపంచంలో అన్నిటికంటే ముఖ్యమైనది, విలువైనది డబ్బు కాదు, పేగుబంధం!

## పేగుబంధం ఎంత గొప్పదో అక్షరీకరించలేము

నీవు మొదటిసారి గర్భాన కదిలినప్పుడు పరమానందం కలిగింది
నన్ను అమ్మను చేస్తున్నావని,
నీవు ఊపిరాడనీయకుండా కదులుతూ హడావుడి చేస్తుంటే
ఉత్సాహం కనిపించింది. హుషారైన వాడివి అని.
నన్ను చీల్చుకుని ఈ లోకంలోని వచ్చాక మమకారం పొంగింది
నా ప్రతిరూపానివని.
నా రక్తాన్ని పాలుగా తాగుతూంటే, బోలెడంత ఆశ కలిగింది
అందరి కంటే బలవంతుడివి కావాలని.
తప్పటడుగులు వేస్తూ ఇల్లంతా తిరుగుతూ ఉంటే,
తట్టుకోలేనంత ఆనందం కలిగింది
నీ కాళ్ల మీద నీవు నిలబడగలవని.
ఆ అడుగుల్లోనే నాకు దూరమైతే ఆశీర్వదించాలనిపించింది
గొప్పవాడివి కావాలని.
జీవన ఒత్తిడిలో పడి నన్ను మరిచిపోతే, కొండంత ధైర్యం వచ్చింది
నేను లేకపోయినా బతకగలవని.
ప్రాణం పోయేటప్పుడు కంటతడి పెట్టనందుకు తృప్తిగా ఉంది
నీకు తట్టుకునే శక్తి ఉందని.
ఇప్పుడే బాధగా ఉంది. అందరూ నేను చనిపోయానని ఏడుస్తూంటే నన్ను కాల్చేటప్పుడు నీ చేయి కాలుతుందేమోనని.

– జి. ఆనంద్, సాక్షి, కరీంనగర్
కృతజ్ఞతలు

# బి. నాగిరెడ్డి

## లేని ఆంధ్రా హాలీవుడ్ సినిమా రంగాన్ని ఊహించలేం ఆయనతోనే హాలీవుడ్ శోభను కోల్పోయింది

ఎస్. ఎస్. వాసన్, ఏ.వి. మెయ్యప్పన్ చెట్టియార్ వంటి హేమాహేమీలు చిత్ర నిర్మాతలుగా, స్టూడియో అధినేతలుగా ఉన్నప్పటికినీ, బి.నాగిరెడ్డి సినిమా నిర్మాణ రంగంలో ప్రవేశించి అనేక గొప్ప చిత్రాలను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నిర్మించారు. ఆయా బాషల్లో మేటి హిట్ చిత్రాలను మేటి నటీనటులతో నిర్మించారు. మేటి నటీనటులను, తన చలనచిత్రాల్లో నటింపచేసారు. ఆయన చిత్రాల్లో నటించినవారు రాష్ట్ర మంత్రులయ్యారు, ముఖ్యమంత్రులయ్యారు. కానీ ఆయన ఎవరికీ తలవొంచలేదు. దక్షణ ఆసియాలో పెద్ద స్టూడియోగా విజయా వాహినీ స్టూడియో పేరుగాంచింది. ఆయన స్థాపించిన బి.ఎన్.కె. ప్రెస్సు దేశంలోనే పెద్ద ప్రెస్సుగా ఖ్యాతిగాంచింది. రాజ్‌కపూర్ వంటి ప్రముఖ నటులు తమ చిత్రాల వాల్‌పోస్టర్స్‌ను ఇక్కడే ప్రింటు చేసారు. ఆయన స్థాపించిన 'చందమామ' పిల్లల పత్రిక 14 భాషల్లో వెలువడింది. ఆయన స్టూడియోలో 14



ఫ్లోరులుండేవి. ఆయన ఏ పని చేసినా మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని చేసేవారు. మధ్యతరగతి ప్రజల కోసం విజయా ఆసుపత్రినీ, ఎగువ మధ్య తరగతి, రాష్ట్రేతర ప్రాంతాల వారికోసం విజయ హెల్తు సెంటర్‌నూ నిర్మించారు. మధ్యతరగతి ప్రజల కోసం పాఠశాలలను స్థాపించారు. సంస్థ ఉద్యోగుల కోసం కో-ఆపరేటివ్ స్టోర్సు ప్రారంభించారు. ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షులుగా ఉన్నపుడు తిరుమలను సుందరంగా తీర్చిదిద్దారు. వైకుంఠం, క్యూ కాంప్లెక్సును నిర్మించారు. ●

## వ్రాతవెంటగాని, వరమీడు దైవంబు చేతకొలదిగాని, వ్రాతరాదు
## వ్రాతకజుడు కర్త - చేతకు తాగర్త విశ్వదాభిరామ వినుర వేమ

మనం చేసే మంచి పనులు విధివ్రాతనుబట్టి ఉంటాయి. చేత మన అధీనంలో ఉన్ననూ రాతను మాత్రం బ్రహ్మ వ్రాయవలసిందే!

**ఆకుమీద వ్రాత అందరికీ తెలియు**
**చేతిలోని వ్రాత చెప్పవచ్చు.**
**తోలు క్రింది వ్రాత దొడ్డవాడెరుగునా**
**విశ్వదాభిరామ వినురవేమా!**

- పత్రాల మీద ఉన్న వ్రాతను సులభంగా తెలుసుకోకల్గుతాం. అది చేతుల్లో ఉన్న వ్రాతను రేకలను బట్టి అంతో ఇంతో చెప్పకలుగుతాం. కానీ బ్రహ్మ నుదుటిపైన వ్రాసిన వ్రాతను చెప్పగలమా - అంటాడు వేమన. కానీ నొసట వ్రాసిన వ్రాత నూరేళ్ళు ధర జెల్లుననే సామ్యం ఉన్నది. నూరేళ్ళు అని సంఖ్యాపరంగా చెప్పలేదు, సామ్యపరంగా ఆయనే ముందుగ చెప్పారు.

**ఆకులేని కొమ్మ అభ్రమెల్లను నిండె**
**మ్రాకు మొదలు తుదలు మహిని లేదు**
**ఏకమైన పండు నింపొందుచుండును**
**విశ్వదాభిరామ వినురవేమ** - అన్నాడు.

ప్రకృతియనే మహావృక్షమునకు కొమ్మలూ లేవు, రెమ్మలు లేవు, ఆకులూ లేవు. అది ప్రపంచమంతటానూ వ్యాపించి యున్నది. దానికి ఆదీ అంతము లేదు. మూలం అసలే తెలియదు. అది బ్రహ్మాండమంతా వ్యాపించి ఉన్నది. బ్రహ్మానందఫలాన్ని అందిస్తున్నది.

ఎంత విచిత్రం అంటూ ఆశ్చర్యాన్నొలకపోసాడే. సృష్టి విచిత్రమైనది అన్నాడు. సృష్టి విచిత్రమైనదే! విశ్వామిత్రుని వంటి తపోనిష్ఠాగరిష్టుణ్ణి త్రిశంకు స్వర్గంలో పడవేసింది, సృష్టికి ప్రతిసృష్టి చేయడం కష్టమనే పాఠం నేర్పింది. పాంచభౌతిక నిర్మితమైన ఇంద్రియం చరించుటవల్లనే ఇంతటి సృష్టి జరుగుచున్నది. ఈ ఇంద్రియ సంచార శూన్యత తటస్థిస్తే ఉత్పత్తి కార్యం ఆగిపోతుంది. సృష్టికి విఘాతం యేర్పడుతుంది. సృష్టికి విఘాతమేర్పడితే మహాప్రళయం సంభవిస్తుంది. మహాప్రళయమే సంభవిస్తే ఏ ప్రాణీ ధరను బట్టకట్టదు. కట్టలేదు. మరో బ్రహ్మ పుట్టాలి; మరో సృష్టి జరగాలి. ఈ మహాప్రళయ పరిణామ దశ రాకుండా ఉండటానికే ఈ పదునాలుగు లోకాలలోనూ నరులు పుట్టి, జీవించి, మరణాన్ని పొందుతున్నారు. తిరిగి పుడుతున్నారు. నరులు అశాశ్వితులు. కానీ జీవరాశిగల ప్రపంచం శాశ్వతం. జీవుడు పుడుతూంటాడు, జీవిస్తూంటాడు, సమయమాసన్నం కాగానే మరణిస్తూంటాడు. మరణమనేది అతనికి తెలియదు. ఈ విషయాన్నే కృష్ణ పరమాత్మ అర్జునునితో - నీవెన్నోసార్లు పుట్టావు, జీవించావు, నీ పుట్టుక మరణములు నీవెరుగవు" అని అంటాడు. ఆయన పరమాత్ముడు గనుకనే అంత ధృఢంగా చెప్పకలిగాడు. పుట్టిన ప్రతీవాడూ గిట్టక తప్పదు. పుట్టుక గిట్టుకలమధ్య జీవితాగమనాన్ని సార్థకం చేసుకోకలిగినవాడే ధన్యుడు! వాడే మానవుడు, వాడే మహనీయుడు!

ఈ సత్యాన్నెరుగకనే, మానవులు జీవితం అశ్వాస్వతమంటున్నారు. అశ్వాస్వతమన్నవారే మాయలో పడుతున్నారు. అనుభవిస్తూన్నవన్నీ శాస్వతములనుకుంటున్నారు. శాస్వతములు కాని వాటికోసమే జీవితాంతమూ ప్రాకులాడుతూన్నారు.

వేదపురాణాలు ప్రాకటితంగా తెలిపిననూ గ్రహించడం లేదు. బలంగా పెరిగిన వరిపైరు తీరా పండే కాలాన గింజ పట్టకపోయినట్లు గ్రహించలేకున్నాం. శాస్త్రజన్య జ్ఞానం భక్తిరూపంగా పరిణమిస్తేగానీ ప్రయోజనం సిద్ధించదు. సంశయలనేకంగా తొలగించి పరోక్షంగా ఉండే పరమార్థాన్ని దర్శింపచేసేది శాస్త్రం. శాస్త్రమనే సాలోచన చేయనివాడు అంధుడే అంటోంది పంచతంత్రం. భగవంతుని పాద సంసేవాశక్తియే జ్ఞానం. ఆ జ్ఞానమెరుగకపోవడమే అజ్ఞానం అంటుంది శాస్త్రం. ●

# జంబూద్వీపం నుంచీ క్రౌంచద్వీపానికి వచ్చి రెండు వారాలైనా - 72 గంటల బడలిక తీరలేదు! జ్ఞాపకపుటంచులు విడనాడలేదు!

ఎన్నో పర్యాయములు అమెరికా వచ్చినా ఈసారి ప్రయాణరూటు సెపరేటు. (ఆంగ్ల పదాల వాడకం తప్పలేదు)

లుఫ్తాన్సా ఎయిర్‌వేస్‌లో జర్మనీలోని ఫ్రాంక్ ఫర్టుద్వారాగానీ, నీవార్కు (న్యూజెర్సీ) విమానాశ్రయం చేరుకునేవాణ్ణి. అబ్బాయి సాయిప్రసాద్ ఉన్న ఎడిసన్‌లోని ఇంటికి గంటలో చేరుకునేవాణ్ణి. ఈ పర్యాయం నా ప్రయాణం ఎతిహాడ్ ఎయిర్‌వేస్ కేంద్ర స్థానమైన అబూదాబీ మీదుగా సాగింది. న్యూయార్కు చేరుకుని న్యూజెర్సీ వెళ్ళడం ఓ చంద్రలోక యాత్ర వంటిది. ఏ మార్గమైనా, అమెరికా చేరుకోవడానికి రెండు రోజులు, గంటలుగా చెప్పాలంటే పదిహేడు గంటలు.

సగరుని కుమారుడు యీ సాగరాల్ని తవ్వి యెలా మార్గనిర్దేశనం చేసారో తెలియదు గానీ, ఈసారి అబూదాబీ మీదుగా అరబ్బు దేశాల వారి ఐశ్వర్యాన్ని వీక్షించడం జరిగింది.

అరబ్బు దేశాల్లో అబూదాబీ వంటి అద్భుత విమానాశ్రయం కనులారా చూడడం తటస్థించింది. నగర విస్తీర్ణం ఎంత ఉంటుందో తెలియదుగానీ, విమానాశ్రయమే మహానగరమంత విశాలంగా ఉన్నది. ఆ విమానాశ్రయం మేనేజర్ శ్రీనివాసరావు తెలుగువాడని తెలియగానే ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూడాలనిపించింది.

సగర మహారాజు కుమారా! నీవు భారతీయుడవు కావడం వల్లనేమో గానీ, యా భారతాంధ్ర కుమారుల్ని పలు దేశాల ప్రముఖులయ్యేట్టు చేసావు. తానీషామాత్యులైన అక్కన్న మాదన్నల కృషి ఊరకనే ఉంటుందా? నైజాము పాదుషా కీర్తి విస్తారకులు వారే కదా! వారి మార్గంలోనే అరబ్బు పాదుషాలు తెలుగువారికి సముచిత స్థానాన్నిచ్చి ఉంటారు. ఆ కోవల్లో ప్రముఖస్థానాన్ని అధిష్ఠించినవాడే శ్రీనివాసరావు అయ్యుండవచ్చు! ఎక్కడ ఏ తెలుగువాడు ప్రముఖ స్థానంలో ఉన్నా గుర్తించి గౌరవించే ప్రముఖాంధ్ర, వారిని చూడలేదన్న ఒకింత బాధను పొందింది.

ఓ తెలుగువాడు పదిమంది తెలుగువారి ఔన్నత్యానికి కారకడవుతాడన్నది ప్రముఖాంధ్ర ప్రగాఢ విశ్వాసం. ఆ విశ్వాసాన్ని శ్రీనివాసరావు నిలబెట్టగలరనే విశ్వాసం కలిగింది. తెలుగువాని ప్రతిభను ప్రముఖాంధ్ర గుర్తించకుండా ఎలా ఉండగలదు? ఈ విషయంగానే ఓ పాత విషయాన్నే కొత్తగా చెప్పవలసి వస్తూన్నది. ఐదారు దశాబ్దాల క్రితం జరిగిన ఒక సమావేశంలో దర్శక నిర్మాత పి.పుల్లయ్యగారూ, మరో దర్శక నిర్మాత ఏ.ఎల్. శ్రీనివాసన్‌గారూ, నేనూ కూర్చుని ఉన్నాం. ఆయన పుల్లయ్యగారిని ప్రశంసిస్తూ మా పుల్లయ్యగారిని మా తమిళ దైవం మురుగన్, నిండు నూరేండ్లు ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదిస్తూ, కరుణించగలడని అన్నారు, పుల్లయ్యగారు నవ్వుతూ చూసావా 'శ్రీనివాసూ! నీకు మా ఇలవేల్పు వేంకటేశ్వరుడే, నీకు శ్రీనివాస్ – అనే పేరొసగినాడు, నిన్నాయన నిండు నూరేండ్లూ ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదిస్తూ, కాపాడగలడన్నారు. స్తబ్ధుగా నున్న సభ కాస్తా కిలకిలా నవ్వింది. దేవుళ్ళలో కూడా తెలుగు తమిళ దేవుళ్ళు గిరిగీసుకుని ఉంటారా – అని ఆశ్చర్యపోయాం.

మన చరిత్రకారులు కొన్ని వాస్తవాలను అక్షరీకరించలేదా? అక్షరీకరించిన విషయాల్ని మరిచిపోయామా అనే సంశయం కలుగుతూంటుంది. కొలంబస్ దేశాలను సందర్శించాడనేది ఆనాడు ఒక వార్తయింది. కానీ అంతకు పూర్వమే, సగర మహారాజుని పుత్రులు యాగాశ్వాన్వేశణంలో భువిని త్రవ్వుతూ పోగా సాగరాలు ఏర్పడ్డాయన్న ఇతిహాస విషయాన్ని గుర్తించిన వారు అరుదుగా ఉన్నారు. అదే ఇతిహాడ్ ఆకాశమార్గం, ఆ ఇతిహాడ్ మార్గంలోని ఆకాశయాన కేంద్రం అబుదాబీ అయి ఉండవచ్చునని ఆ విమానాశ్రమంలో అడుగిడిన తోడనే నా మనస్సు భావించింది. మనస్సు యెప్పుడూ పూర్వపెద్దల ఆంతరంగికారాన్నీ స్ఫురణకు తెచ్చుకుంటూంటుంది. గురజాడ అప్పారావు గారన్నట్లు దేశమని యెడు దొడ్డ వృక్షము ప్రేమలను పూలెత్తవలెనోయ్' అన్నారు. అబూదాబీ భూగడ్డపై అడుగు పెట్టగానే నాకు అదే అభిప్రాయం కలిగింది. అదేంవీ కొత్త అనిపించలేదు, ఆ మనుష్యులూ కొత్తయనిపించలేదు.

ఒక్కొక్కప్పుడు తెలుగువారి ప్రతిభను గుర్తించే సమయంలో వొళ్ళు పులకరించే సందర్భము వస్తూంటుంది. ఆ పులకరింపులో కలిగిన భాషావేశపు చిలకరింపునే ఇందు పొందుపరుస్తున్నాను!

**తెలుగు దేశము తేజరిల్లగ**
**తెలుగు వెలుగులు దిశల నిండగ**
**పాడరా ఓ తెలుగువాడా – పదం**
**పాడరా ఓ కలిమితేడా!**
**పాతకొత్తలను మేళవించీ**
**పదం పాడరా ఓ తెలుగువాడా!**

– అని నా కలం హలంలా సేద్యం చేసింది. నింగినంటే వెలుగును నిండింప చేసింది.

కొలంబస్ దేశాలను సందర్శించాలనుకున్న వార్త ఆనాటి వార్తగా ప్రముఖమయిందిగానీ, అంతకు పూర్వమే సగర పుత్రులు యాగాశ్వం కోసం సాగరాలను త్రవ్వినారన్న యదార్థ వార్తను ఇతిహాస వార్తగా చెప్పుకుంటున్నాంగానీ – ఇది వాస్తవమని ఎంతమంది భావిస్తున్నారు? ఈ ఇతిహాసమే ఎతిహాడు ఎందుకు గాకూడదు! ఇటువంటి అద్భుతాద్భుతమే అబుదాబీ అయ్యుండవచ్చు.

– గోటేటి శ్రీరామారావు


Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

Lovely Stay at Holy Tirupathi    The Gateway of Lord Balaji

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

# ప్రాణుల మేలుకు పాటుబడేవాడే ఆర్యుడు!

శ్రేష్ఠమైనవాడి మనస్సునే 'ఆర్యత' అన్నారు!

'ఆర్యత' యొక్క ప్రగతినే జగతి ప్రగతి అన్నారు! జగత్ప్రగతినే జాతిప్రగతికి దోహదకారి అవుతుందన్నారు! జగత్ప్రసిద్ధి చెందకుండా జాతిప్రగతి ప్రగతి మార్గంలో పయనించదన్నారు!

జగతి ప్రగతి జగత్ప్రగతిపై ఆధారపడియుందన్నారు! జలంపై జగతి ఉన్నట్లుగానే, జగతిని ఆధారం చేసుకుని జగత్ప్రగతి ఉందన్నారు. జగమే జగతి! జగతియే జనప్రగతి! ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నవి అనడం కన్నా ఆధారభూతమై ఉన్నవి అనడం సమంజసమనిపిస్తుంది!

జగం కూడా జలంపైననే ఉన్నది. జలం లేకుండా జనం జీవించలేదనీ, జనం లేకుండా జగం లేదన్నది వాస్తవం.

ప్రాణుల మేలు కోరడంలో ఆర్యుడు ఆధారభూతుడు. ఆర్యునికి ఆధారభూతమైనది "అర్హత" అన్నది వాస్తవం! అయితే వాస్తవాన్ని మరచి జగతి సాగుతున్నది మరో వాస్తవం! ప్రాణుల మేలుకు పాటుబడే ఆర్యుణ్ణి కూడా మరుస్తున్నది కాబట్టే శ్రేష్ఠత అనే మాటకు విలువ తగ్గుతూ వస్తున్నదన్నది సత్యము. సత్యము వినా జగత లేదన్నది కూడా వాస్తవమే!

ఇంతకూ 'సత్యము' ఏంవిటన్నది ప్రశ్నించుకున్నప్పుడు సత్యమును పదమూడు విభాజ్యములుగా చేసి చెప్పారు. ప్రాణులకవి మేలు చేస్తున్నాయి కాబట్టి వాటిని తెలుసుకొనే ప్రయత్నం అవసరమైనది కాబట్టి కొంతగా తెలుసుకుందాం.

1. సత్యము, 2. సమతా, 3. దయము, 4. మత్సరతా అభావము, 5. క్షమా, 6. లజ్జా, 7. తితీక్ష, 8. అనసూయ, 9. త్యాగము, 10. ధ్యాయము, 11. ఆర్యత, 12. ధృతి, 13. అహింస.

ఈ 13 ధర్మములూ ఒకే సత్యమును రూఢింపచేస్తున్నవి. నిత్య నైమిత్తిక కర్మలను ఆచరింపచేస్తున్నవి. నిషిద్ధ కర్మల నాచరింపక, ప్రస్తుతాచారములందు స్థితి కలిగియుండువాడు 'ఆర్యు'డనబడుచున్నాడు. చిత్తమును సదా తృప్తి కల్గింపచేయువాడు. ఏ ఆర్యుడు ప్రాణుల మేలు కొరకు పనిచేయునో అతని శ్రేష్ఠతనే 'ఆర్యత' అంటారు. జగతి యొక్క ప్రగతియే ప్రతిభ.

ఇది తాగ్యభావమును ప్రకటింపచేస్తుంది. ఇద్దానినే 'ఆర్యత' అంటారు. మన పెద్దలు తమ పెద్దలను 'ఆర్యా!' అని గౌరవ వాచకంతో పిలవడం ఆచారమై ఉంటుందని నా భావన. ఇందు ఆసక్తి త్యాగభావన ఉంటుందన్నది నా విశ్వాసం.

ఇహధృతి – సుఖదుఃఖముల ప్రాప్తించినపుడు మనసులో విచారం కలుగుకుండుటయే ధృతి అంటారు. దేహేంద్రియములు నీరసించినప్పటికీనీ, వాటిని కార్యోన్ముఖుని కావించడమే ధృతి అంటారని పూజ్యశ్రీ మధుసూదన సరస్వతీ స్వాములవారన్నారు.

పదమూడవది అహింస, మనోవాక్కాయ కర్మలచే, ఏ ప్రాణికినీ ద్రోహము తలపెట్టనిదే అహింస. ఈ 13 భేదములూ సత్యము యొక్క స్వరూపములే' – అయి వున్నవి.

ఈ పదమూడునూ సత్యమును ఆశ్రయించుకుని ఉన్నవే! సత్యం వినా వీటికి మూలాధారమేదియూ లేదు. సత్యము యొక్క వృద్ధినీ, విస్తృత సృష్టినీ చేయుచున్నవి, సత్యం అనన్తమ్ జ్ఞానం బ్రహ్మ అని సత్రీకృతం చేస్తున్నవి. త్రైకాలికా బాధ్యత్వం సత్యత్వములను రూఢిపరుస్తున్నవి.

సత్యశబ్దమునకు అర్థము 'బ్రహ్మ' అని అనేక పర్యాయములు ప్రయోగించబడినది. సర్వమూ సత్యరూప పరమాత్మమయమే. తద్వ్యతిరిక్త మన్యవస్తువేదీ చేయునూ లేదు – అను దృఢ నిశ్చయమేది కలదో దానినే వేదాంత నిష్ణాతిపరులైన శ్రేష్ఠ పురుషులు సర్వశ్రేష్ఠ సత్యమని నిర్ధారించి చెప్పారు. ఎల్లప్పుడూ మాయా తత్కార్యముచే పూర్ణతః విముక్తమై యున్న పరమ సత్యరూప పరమాత్మను మేము ధ్యాపించుచున్నామని శ్రీ మద్భాగవతపు మంగళ శ్లోక పాదార్థమీ రీతిగా తెలియచేయుచున్నది.

**శ్లో॥ సత్యవ్రతం సత్యపరం త్రిసత్యం**
**సత్యస్యయోనిం నిహితం చ సత్యే**
**సత్యస్య సత్యమృతసత్య నేత్రం సత్యాత్మకం**
**త్వాం శరణం ప్రసన్నాః!!**

తా॥ ప్రభో, నీవు సత్యసంకల్పుడవు. నిన్ను పొందుటకు సత్యమే శ్రేష్ఠమైన సాధనమన్నది. సృష్టి స్థితి నియమములను నసత్యావస్థలలో గూడా నీవు సత్యరూపుడవై ఉన్నావు. మరియు వాటిలో నంతర్యామి రూపముచే విరాజమానవై ఉన్నావు. నీవు ఈ దృశ్యమాన జగత్తు యొక్క పరమార్థ స్వరూపమై ఉన్నావు. నీవే మధురమైన వాణికి మరియు సమదర్శమునకు నేత్రమువై ఉన్నావు. నీవే మధురమైన వాణికి మరియు సమదర్శనమునకు నేత్రమువై ఉన్నావు. హే భగవాన్, నీవే సత్యస్వరూపుడవు. మేము నీ శరణుజొచ్చి యున్నాము' అని ప్రార్థిస్తున్నాను. సవినయంగా తెలియచేస్తున్నాను. ●

## వివేకానంద సింహనాదం

ప్రతి జీవియు శక్తివంతమైన దివ్యమగు ఆత్మస్వరూపము. బాహ్య, అభ్యంతర ప్రకృతులను వశపరచుకొని అట్టి దివ్యత్వమును వ్యక్తపరచుటయే జీవుని లక్ష్యము. ఇట్టి లక్ష్యమును కర్మచే గాని లేక ఉపాసనచే గాని లేక మనోనిగ్రహముచే గాని, లేక మనోవిగ్రహముచే గాని, కొన్నిటిచే గాని సాధించి విముక్తుడవు కమ్ము. సమస్త మతముల యొక్క సారాంశమిదియే. ఇక తక్కిన సిద్ధాంతములు కర్మ కలాపములు, పుస్తకములు, మందిరములు, రూపములు అన్నియు దీని తరువాత విషయములే యగును. కావున ప్రధానమైన ఆత్మసంయమమును, ఇంద్రియ నిగ్రహమును అలవరుకొని ధన్యులగుదురుగాక!

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464



**దాశరధి కవిత్వంలో
పోరాటం ఉందేమో
కానీ,
దాశరధి మోములో
పోరాట గుణం
కన్పించలేదు.
మోమున ఎంతటి
ప్రశాంతత,
ఆ ప్రశాంతత
మాటున మధ్యాహ్న మార్తాండుడు దాగి వున్నాడా?
అక్షర తూణీరంల్లాంటి ఆ భావాలు
దాశరధి మోములో కన్పడలేదే!**

సినిమా పాటల కవిగా ఆయన చెన్నపట్నం వచ్చారు. అన్నపూర్ణా పిక్చర్సు కార్యాలయంలోని మేడ మొదటి అంతస్తు నుంచీ మెట్లు దిగి వస్తున్నారు. నేను మేడ మెట్లు ఎక్కి అన్నపూర్ణా మధుసూధనరావు గారి కార్యాలయం గదిలోకి వెళ్ళాలని చూస్తున్నాను.

మెట్టు ఎక్కేవాణ్ణి ఒక మెట్టు కిందకే దిగాను. ఆయన్ను చూడగానే అంతటి అపురూపపు గౌరవం కలిగింది.

ఆయన చనువుగా మీతో ముఖ పరిచయం లేకున్నా, మిమ్మల్ని గూర్చీ మీ సాహితీ కృషిని గూర్చీ ఎరుగుదును. ఎరిగినప్పట్నుంచీ, మీపై గౌరవం పెంచు కుంటూ వచ్చాను' అన్నారు. అణకువ, ఆప్యాయత, గౌరవం మూడూ కలిపిన ముగ్ధమోహన ముఖబింబం ఆయనలో కన్పించింది.

నైజాము నిరంకుశ ఏలుబడిలో ఉన్న హైదరాబాదు సంస్థానంలో 1925 డిసెంబర్ 22న ఆయన జన్మించారు. ఆయనకు చిన్నప్పట్నుంచే తిరుగుబాటు తత్వం అలవడింది. ప్రజలతో మమేకమై పోరాటం చేసాడు. చేతి కలాన్ని ఆయుధంగా మలిచాడు. విష్ణుచక్రంలా తిప్పాడు. దాశరధి పేరు కాబట్టి ధనుర్బాణాలను విసిరాడు. దాశరధి పేరు కాబట్టి శివధనస్సును పెళాపెళా విరిచాడు. సవ్యసాచిలా, రెండు చేతులతో బాణాలను సంధించాడు. నైజాం కోరలు విరవడానికి ఆయన అక్షణతూణీరాలు ఆయుధాలయ్యాయ్. గురిచూచి సంధించడంతో నైజాము గుండెలు పగిలాయి; గూండాల ఆటలు కట్టుబడ్డాయ్!

మధ్యాహ్న మార్తాండుని తీవ్ర వీక్షణ వేడిమి దాగి వున్నది! ఎన్ని నదీజలాలు పోస్తే ఆ ఉష్ణం చల్లారుతుంది? చల్లారదు. చల్లారని బడబాగ్ని! జ్వలిస్తూనే ఉంటుంది! అన్యాయాన్ని దహించేవరకూ అది అలాగే ఉంటుంది; భుగభుగలు చిమ్ముతుంది! ●

## విశ్వమానవ విశిష్ట శిష్ట కవి దాశరధి

తాను చూసినదేఁవిటో మన కళ్లముందు జరిగనట్లుగా సాక్షాత్కరింపజేస్తాడు దాశరధి. మనం చూడనిది, చూడలేనిదీ, చూడలేకపోయిన దాన్ని కూడా తన కవిత్వంలో దృశ్యమానం చేయటం మంచి కవులకు వెన్నతో పెట్టిన విద్య. సమాజంలో కరుడుగట్టిన దుర్మార్గం, జనం పడే బాధలు చూసి చలించిన వ్యక్తి అనుభవంలోంచి.. వేదనాభరిత జీవిత సంఘర్షణ లోంచి తన కవిత్వంతో తిరుగుబాటు చేసాడు. నిరంకుశ నిజాం ఏలుబడిలో వున్న హైదరాబాద్ సంస్థానంలో 1925 జూలై 22న జన్మించాడు. దాశరథి తన బాల్యం నుంచే తిరుగుబాటు తత్వాన్ని అలవర్చుకున్నాడు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో నిజాంకు వ్యతిరేకంగా ప్రజలతో మమేకమై పోరాటం నడిపించాడు దాశరథి. తన కవిత్వంతో ప్రజలను కార్యోన్ముఖుల్ని చేసినందుకు నిజం జైలుపాలు చేస్తే తన స్వేచ్ఛా పిపాసను అగ్నిధారలా బాణాలను విసిరాడు దాశరథి.

తమ కవిత్వం ద్వారా ఉద్యమాలకు బాసటగా నిలిచిన కవులలో దాశరథికి ఒక విశిష్ట స్థానం ఉంది. సమాజ పోకడలను అర్థం చేసుకుని సమాజ దుష్టత్వాన్ని అంతమొందించాలని కృషి చేసినవాడు ఆయన. దాశరథి కవిత్వంలో పోరాటతత్వం ఒక ఎత్తైతే ప్రశ్నించే తత్వం, ప్రశ్నించటం ద్వారా సత్యాన్వేషణ అనేది మరో ఎత్తు. ఆయన రాసి 'ఆ చల్లని సముద్ర గర్భం' గేయం ఒక్కటే చాలు విశ్వకవిగా నిలబెట్టింది. గేయం ఎత్తుగడ నుండీ ప్రశ్నలే ప్రశ్నలు! అవి జవాబులేని, జవాబు దొరకని ప్రశ్నలు కావు. ఒక సార్వజనీనమైన సత్యాన్ని ఆవిష్కరించాయి. యుగయుగాలుగా జరిగిన, జరుగుతున్న వాస్తవాలను, అన్యాయాలను కళ్లముందుంచాడు. ప్రశాంతంగా కనిపించే సముద్రంలో దాగివున్న బడబానలాన్ని గుర్తుచేసాడు. సజావుగా సాగుతుందనుకునే సమాజంలో రాజుకుంటున్న 'మార్పు' అగ్నిని ఆవిష్కరించాడు.

ఈ భూగోళం, జంతుజాలం, మానవుడూ, అతీత శక్తుల సృష్టియని నమ్మబలుకుతున్న వాళ్ల నడుములు విరిచాడు. విజ్ఞాన శాస్త్ర సత్యాన్ని రెండే రెండు పంక్తుల్లో కవిత్వీకరించాడు. సౌర వ్యవస్థ, సూర్యుని నుండి విడిపడిన సురగోళాలు, అందులో భాగంగానే భూమి కూడా ఏర్పడిందని సైన్సు నిరూపించింది. కానీ ఆ విషయాన్ని వివరించడానికి ఎన్ని ఉద్గ్రంథాలు రాసినా సామాన్యునికి అర్థం కావు. కానీ రెండే రెండు పంక్తుల్లో భూమి ఏర్పడిన వాస్తవాన్ని వివరించాడు.

దాశరథి కవిత్వంలో పోరాటతత్వం ఒక ఎత్తైతే ప్రశ్నించే తత్వం, ప్రశ్నించటం ద్వారా సత్యాన్వేషణ అనేది మరో ఎత్తు. ఆయన రాసిన 'ఆ చల్లని సముద్ర గర్భం' గేయం ఎత్తుగడ నుండీ ప్రశ్నలే ప్రశ్నలు! మూఢత్వం, అశాస్త్రీయ ధోరణులు ప్రజాజీవితాన్ని దుర్భరం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో దాశరథిని కల్పించిన ఆయుధం గేయం. ఇదొక వైజ్ఞానిక, మానవీయ, మహత్తర గేయం. ఈ గేయాన్ని పాడుతూ నవయుగం వైపు ప్రజలను కార్యోన్ముఖుల్ని చేస్తూ గాయాలను మాన్పు చేశాడు.





# ఆయన పేరు అచ్చయ్యకుమార్ ఆయన విలాసం మలేషియా ఆంధ్ర సంఘం! కౌలాలంపూర్ నందు పేరొందిన వైద్యుడు!

తెలుగు వ్యాప్తి కోసం అహరహమూ కృషి చేస్తున్న కృషీవలుడు! ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రముఖులనూ ఆహ్వానిస్తూంటాడు! ఇంటింటి, వీధి వీధినా, మలేషియా ఊరుఊరునా తెలుగునోట తెలుగును మాట్లాడించాలని హృద్యమాలను కొనసాగిస్తున్నాడు!

తెలుగు ప్రముఖులను సన్మానించడమే గానీ, సన్మానరుచ్యంబెరుగని అచ్చయ్యకుమార్‌ను దివ్యమైన దివిసీమకు ఆహ్వానించిన దివ్యమైన మండలి వేంకట కృష్ణారావు సంస్కృతీ పురస్కారం అందచేసారు ఆంధ్ర శాసన సభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్!

బుద్ధప్రసాద్ బుద్ధుని వంటి శాంతకాముకుడు, శాంతమూర్తి. ఆయన తండ్రి కీ॥శే॥ మండలి వేంకట కృష్ణారావు, హైదరబాద్‌లో ఘనాతిఘనంగా తొలి ప్రపంచ తెలుగు మహాసభలను జరిపించిన ఘనాపాటి. అంతటి ఘనాపాటి డా॥ అచ్చయ్యకుమారుని సత్కరించడం అస్మదీయులకు మహదానందం కల్గించింది.

'సాధు సంగంబు సకలార్ధ సాధకంబు' అన్నారు. నవవాద బృంద గీతం యువతరంగళాల మీదుగా సాగాలి. లేనిచో నేతి బీరకాయ చందంలా – ఇంటిపేరు చైతన్యం, ఊరు సహజీవనం, తీరు సమభావం. ఇతివృత్తం మానవత్వం, ధ్యేయం లోక కల్యాణం అనునవి వేటికవే తీర్ధం తీర్ధంలా, ప్రసాదం ప్రసాదంలా వేర్పడిపోతాయి. మానవాళి ఒక్కటిగా ముందుకు సాగడం అసాధ్య మవుతుంది – ఈ సూత్రాన్ని గ్రహించిన డా॥ అచ్చయ్యకుమార్ మలేషియాలోని తెలుగు వారిని ఇతర మలేషియా జనులతో కలుపుకుని పోతున్నాడు. శరీరతత్వమెరిగిన డాక్టర్ మనః స్తత్వమెరుగకుండా ఉంటాడా? అతడు నిరతమూ జయపథంలో పురోగమిస్తూ, మలేషియా తెలుగు జనులను పురోగమింపచేస్తున్నాడని ఆశిద్దాం. ●



అచ్చయ్యకుమార్ గారిని నేను ఎనిమిదేళ్ళ క్రితం మలేసియాలోనే కలుసుకున్నాను. మలేసియా తమిళ సంఘం ఆహ్వానంపై మలేసియా వెళ్ళిన నేను ఆయన్ను వెతుక్కుంటూ ఆయన క్లినిక్కుకి వెళ్ళాను. ఆయన అక్కడ బిజీ డాక్టర్. అయినప్పటికీ తెలుగుపైనున్న ప్రేమాభిమానాలతో తెలుగువారినందరిని ఐక్యపరచి అతి పెద్ద సభ జరిపి మలేసియా ప్రధానమంత్రిని ఆ సభకు రప్పించి తెలుగేతరులు కూడా ముక్కుమీద వేలేసుకునేంత గొప్ప కీర్తిప్రతిష్ఠలను సంపాదించారు. మలేసియా తెలుగువారిలో యువకుల నుండి పెద్దల వరకూ ఆబాలగోపాలానికి ఆయనంటే అభిమానం. మొన్న ఫిబ్రవరిలో ప్రపంచ తెలుగు సమాఖ్య జరిపిన వార్షికోత్సవానికి వచ్చినప్పుడు ఇద్దరం ఆత్మీయంగా పలుకరించుకున్నాం. నన్ను ఒకే ఒక్కసారి చూసినా గుర్తుపట్టి పలకరించారు. తరువాత వచ్చే సంచికలో ఆయన్ను గురించి వివరంగా చెపుతాం.

– జీవిరావు

# నియమం గల జీవితమే నిత్యసుందరం...

'నియమం గల జీవితమే నిత్యసుందరం' అన్నారు కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు. నియమం, నియతి, క్రమం, చట్టం, శిక్షణ ఇదంతా సృష్టి యొక్క శోభ. సృష్టి యొక్క అందం. సృష్టి యొక్క వైభవం. సృష్టి ఇంత అర్థవంతమై, సౌందర్యవంతమై శోభించడానికి కారణం అందులోని నియతి, నియమం, క్రమం.

మన భారతీయ సంస్కృతి మానవ వికాసానికి, మానవ మహోదయానికి ఒక అపూర్వమైన క్రమాన్ని, పద్ధతిని, నిష్ఠను ఏర్పరచింది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకు మన పనులన్నింటిని ఒక లక్ష్యసిద్ధికి అనుకూలంగా ఏర్పరచుకోవటానికి ఒక నియతి ఉండాలి. ఏది సాధించటానికైనా నియమం ఉండాలి. 'విజయం, సంతోషం, ఆనందం మనిషి యొక్క వారసత్వ సంపద. అయినా మనిషి శాంతిగా బ్రతకలేకపోతున్నాడు. ఆత్మ సంక్షోభంలో అలమటించి పోరీతరిన్నాడు. ప్రశాంతత కావాలంటే మొదట దోషయుక్తమైన విలువల నుండి విముక్తులం కావాలి. అందుకు క్రమ నియమపాలన మొదటి మెట్టు. అదే నిజాయితీ, చిత్తశుద్ధిని అందించి ముందుకు నడిపిస్తుంది' అంటారు స్వామి చిన్మయానంద,

గాంధీగారికి నియమపాలన పట్ల పట్టుదల ఎక్కువ. ఎన్నో సందర్భాల్లో మనం అది గమనిస్తాం. శారీరిక క్రమశిక్షణ వల్ల శరీర ఆరోగ్యం బాగుంటుంది. మనస్సుకు ఒక శిక్షణ ఉంటే మనస్సు సక్రమంగా యోచిస్తుంది. బుద్ధికి సరైన శిక్షణనిస్తే గొప్ప వైజ్ఞానిక సంపద మనదౌతుంది. ఆధ్యాత్మిక సాధన వలన పరమేశ్వర దర్శనం సాధ్యమౌతుంది.

మనస్సుకు నియమనిష్ఠలను అలవరచటం చాలా కష్టమైన పని. మనస్సు కళ్ళెం లేని గుఱ్ఱం లాంటిది. మనస్సు ఒక నియమపాలన వలన మాత్రమే వ్యక్తిగత శక్తులను సమీకరించుకోగలదు. బుద్ధిని వ్యవసాయాత్మకం చేయగలదు. ఒక నియమశీలుడు మాత్రమే రాకపోలతో విసిగించే అనిత్యాలను అవగాహన చేసుకోగలడు. విశ్వపూర్ణ జీవిత వ్యవస్థను అర్థం చేసుకోగలడు. పరిస్థితులకు బానిస కాకుండా యథార్థాన్ని సరిగ్గా అర్థం చేసుకొని, పరిస్థితులకే ఉనికిని కల్పించగల సమర్థుడు అవుతాడు. పనిలో కుశలత్వం, పరిపూర్ణత, ప్రశాంతత ఇవన్నీ ఒక శిక్షణ వలన మాత్రమే సాధ్యం. మన సంస్కృతి మనకు ఒక క్రమాన్ని, కట్టుబాటును ఏర్పరచింది. నా మనస్సుకు నచ్చినట్లు నేను చేస్తే తప్పేమిటి? నష్టమేమిటి? అనుకుంటాం.

ప్రపంచ ప్రసిద్ధిమయిన 'నయాగరా' జలపాతంలోని నీటినంతా కలిపి ఒక బల్బును వెలిగించలేము. ఆ నీటిని క్రమబద్ధం చేసి యంత్రంలో తిప్పినప్పుడు మాత్రమే విద్యుచ్ఛక్తి జనిస్తుంది. మనం ప్రయోజనం పొందుతాం. నీటి ఆవిరి నిర్దుష్టమైన విధానంలో నియమింపబడితేనే యంత్రాన్ని కదిలిస్తుంది. ఒక క్రమపద్ధతిలో, నిర్దుష్టమైన విధానంలో తప్ప మన మనస్సు కూడా కావలసినంత శక్తిని సమకూర్చుకోలేదు. నదిలో నీటిని సక్రమంగా వాడుకోలేకపోతే సముద్రంలో కలిసిపోతుంది. సరిగా వినియోగించుకోని మనస్సు, సమయమూ వ్యర్థమే. నియమితమైన విధానంలో తప్ప జీవితం రాణించదు.

హరిశ్చంద్రుడు, శ్రీరామచంద్రుడు, ధర్మరాజు ఇలా ఎందరో మహానుభావులు నియమ పాలన వైశిష్ట్యాన్ని మనకు బోధించి మార్గదర్శకులయ్యారు.

శ్రీమన్నారాయణుడే నిత్య నియమశీలుడు అన్న విషయం తెలియని వారుండరు.

నియమశీలుని నిష్ఠ అహంకారాన్ని అంతం చేస్తుంది. అసూయతో అంతః కరణ పాడవకుండా కాపాడుతుంది. హృదయాన్ని విలువలతో స్పందింపజేస్తుంది. సదాచారాన్ని చూపి మనిషిని రక్షిస్తుంది. నియమం లేకపోతే మనస్సు పాడవుతుంది. తర్వాతీంత మనిషి పాడవుతాడు. అటుపైన మనుగడ పాడవుతుంది. ప్రాపంచికంగా గాని, పారమార్థికంగా గాని, ఏవిధమైన విజయాన్ని ఆశించినా మనస్సుకు ఒక నిర్దుష్టమైన విధానం అవసరం.

'నియమం' సూర్యోదయం లాగా జ్ఞానోదయాన్ని ప్రాప్తింపజేస్తుంది. అందుకే 'నియమం గల జీవితమే నిత్యసుందరం'. అది ఒక 'సౌభాగ్య భాగ్యోదయం'.

## భారతదేశం ఆధ్యాత్మిక గురువు




ఆధ్యాత్మికతకు సంబంధించిన విషయాల్లో భారతదేశానికి ఎదురు నిలబడగల దేశం మరొకటి లేదు. కాని అదేం చిత్రమోగాని క్రైస్తవ దేశాల నుండి ఇక్కడకు వచ్చిన వారందరిని ఒక పిచ్చి అభిప్రాయం ఆవేశించింది. క్రైస్తవులు అధికారవంతులూ, సంపన్నులూ అనీ, హిందువులు కారనీ, కనుక హిందూమతం కన్నా క్రైస్తవ మంతం గొప్పదనీ వారి అభిప్రాయం. సరిగా ఇదే కారణం వలన హిందూమతం ఒక గొప్ప మతం అనిపించుకొంటుందని, క్రైస్తవ మతం ఆ మాటకు తగదని హిందువులు వారికి తగినట్లు సమాధానమిస్తారు. భౌతిక విజ్ఞానంలో పాశ్చాత్యులు ఎంత ఔన్నత్యాన్ని సాధించినా, పారమార్థిక విద్యలో వారింకా పసిపిల్లలతో సమానులేనని నాకు తోస్తోంది. భౌతిక విజ్ఞానం భౌతిక సంపదలను మాత్రమే చేకూర్చగలదు. ఆధ్యాత్మిక విజ్ఞానం శాశ్వతమైన బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తుంది. ఒకవేళ అమృతత్వం (శాశ్వత జీవితం) అనేది లేదనుకొన్నా, ఆధ్యాత్మిక భావాలు ఆదర్శాలుగా మానవునికి అమిత ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ప్రాపంచిక అనే మూఢత్వం, అధికమైన కోరికలను రేకెత్తించి, స్పర్ధలను జనింపజేసి, చివరికి వ్యక్తిని, సంఘాన్ని కూడా నశింపజేస్తుంది.

## జి.వి. రావ్ పేజీ
(గోటేటి వేంకటేశ్వరరావు)

ఇతరులు వారికి తోచింది వారిని మాట్లాడనివ్వండి.
కానీ మీపై మీరు విశ్వాసాన్ని కోల్పోకుండా
నమ్మిన ఆశయాలను అంటిపెట్టుకొనే ఉండండి. ఇదే విజయానికి మార్గం.
- స్వామి వివేకానంద





## వేద విజ్ఞాన వేదికపై ప్రముఖాంధ్రకు గుర్తింపు

చెన్నైలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుని ప్రతినెలా నాలుగవ ఆదివారం "తరతరాల తెలుగు కవిత" ధారావాహికగా 99 మాసములు పూర్తి చేసుకుని జూన్ 24న నూరవ ఉపన్యాసంగా, డాక్టర్ గరికపాటి నరసింహారావుగారిచే "వ్యక్తిత్వ వికాశం" అనే అంశంపై వేద విజ్ఞాన వేదిక సారథులు శ్రీ జేకే రెడ్డి, శ్రీ కందనూరి మధు, శ్రీ పసుమర్తి బధ్రినాథ్‌లు ఆస్కా సహకారంతో గోదావరి హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమం చాలా గొప్పగా జరిగింది. చెన్నై తెలుగువారికి వేసవిలో చిరు జల్లులా అందరి హృదయాలను ఆకట్టుకుంది. గరికపాటివారి రెండు గంటల ఉపన్యాసం రెండు నిమిషాలలా గడిచిపోయింది. రాత్రి 9/40 గంటలు కావస్తున్నా ఆహుతులందరూ చివరివరకు ఉండడాని బట్టి ఆ కార్యక్రమం, గరికపాటివారి ప్రసంగం అద్భుతం అని అర్ధమయ్యుంటుందనుకుంటా.

ఇదే వేదికపై నాన్నగారు శ్రీ గోటేటి శ్రీ రామారావుగారు "ప్రముఖాంధ్ర" ద్వారా తెలుగు భాషకు చేస్తున్న సేవను గుర్తించి, మమ్ము సత్కరించి, పదివేల రూపాయల నగదు బహుమతిని అంద జేశారు, నాన్నగారు అమెరికాలో ఉన్నందువల్ల ఆ సత్కారం నేను పొందడం నాకు సంతోషాన్ని కలిగించింది. అలాగే మా సోదర సమానులు జనని వ్యవస్థాపకులు గుడిమెట్ల చెన్నయగారిని సత్కరించి వారికి రొఖ్ఖ బహుమతి నివ్వడం నా ఆనందం రెట్టింపయ్యింది.

మా తెలుగు భాషా సేవను గుర్తించిన వేద విజ్ఞాన వేదిక వారికి మా కృతజ్ఞతలు.

## గురువుగారికి శతసహస్ర వందనాలు



మాకు చదువు నేర్పిన మా సైన్స్ మాస్టారు శ్రీ రామచంద్రశాస్త్రిగారి నూరవ జన్మదినం ఆయన వద్ద చదువు నేర్చుకున్న శిష్యగణం నిర్వహించారు. ఆ అవకాశం దక్కడం మా అదృష్టం. ఆ నూరు సంవత్సరాల మహామనీషి ఆరోగ్యంగా వుంటూ అందరికీ స్ఫూర్తిదాయకంగా వుండడం హర్షణీయం.

చెన్నై శ్రీ రామకృష్ణ మిషన్ బాలకోన్నత పాఠశాల, టీ నగర్ ( మెయిన్ బ్రాంచ్), పూర్వ విద్యార్థులు ఆదివారం జూలై ఒకటిన సైన్స్ మాస్టారు శ్రీ కోరాడ రామచంద్ర శాస్త్రి గారి శత జయంతిని హైదరాబాద్, ఎర్ర గడ్డలో ఘనంగా జరుపుకున్నారు. శ్రీ కోరాడ రామచంద్రశాస్త్రి గారు సైన్స్ మాష్టారిగా 1979 లో పదవీ విరమణ అనంతరం చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి స్థిరపడటంతో వీరి శత జయంతి హైదరాబాద్‌లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు (SSLC 1943- 1982) హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, తెనాలి ఇత్యాది నగరాలనుంచి, కొందరు విదేశాలనుంచి కూడా విచ్చేసి వారి మాష్టారిని సత్కరించి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణా మిషన్ అనుబంధ సంస్థ అయిన శారదా విద్యాలయా బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినులు కూడా పాల్గొన్నారు. పూర్వ విద్యార్థి రంగనాథన్ వారి తనయులు శ్రీరాం ఘనాపాటి, శ్రీనాథ్ ఘనాపాటీల వేద మంత్రాల ఆశీర్వచనాలు ఈ కార్యక్రమంలో ప్రత్యేకత.

